



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 214 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు గురువారం 10 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 214 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE THU 10 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

## సీఎం చంద్రబాబు ఇంటి నిర్మాణానికి భూమిపూజ..





- రాజధానిలోని వెలగపూడిలో చంద్రబాబు కొత్త ఇల్లు
- లాంఛనంగా శంకుస్థాపన
- హాజరైన చంద్రబాబు కుటుంబ సభ్యులు
- ముఖ్యమంత్రి కొత్త ఇంటి నిర్మాణ బాధ్యతలు ఎస్ఆర్ఆర్ సంస్థకు అప్పగింత

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని అమరావతిలో సొంత ఇంటి నిర్మాణానికి సంకల్పించారు. భూమి పూజ కార్యక్రమం జరిగింది. చంద్రబాబు, నారా భువనేశ్వరి, నారా లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్ ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్ని కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీనికి సంబంధించిన వీడియోను నారా లోకేశ్ తన యూట్యూబ్ చానల్ లో అప్ లోడ్ చేశారు. చంద్రబాబు రాజధాని ప్రాంతంలోని వెలగపూడిలో సొంతంగా 5 ఎకరాల స్థలం కొనుక్కున్నారు. సచివాలయం వెనుక ఉన్న ఈ-9 రహదారికి పక్కనే ఈ స్థలం ఉంది. ఓ రైతు నుంచి ఈ స్థలం కొనుగోలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలోని వెలగపూడిలో తన నూతన నివాసానికి పునాది రాయి వేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ ప్రతిష్ఠాత్మకమైన ఇంటి నిర్మాణ బాధ్యతను ఏ సంస్థకు అప్పగించారనే విషయం తాజాగా వెలుగులోకి

వివరాలు 2లో..



## నవనీత కృష్ణాలంకారంలో రామయ్య ముగ్ధమనోహర రూపం





**ఒంటిమిట్ట పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 9.** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం నవనీత కృష్ణాలం కారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు,

వివరాలు 2లో..



## మాజీ మంత్రి కాకాణికి హైకోర్టులో షాక్

- క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసు
- కాకాణి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు
- క్వాష్ పిటిషన్ పై విచారణ 2 వారాలకు వాయిదా



**పెన్ పవర్ డెస్క్:**క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ముందస్తు బెయిల్ ను నిరాకరించింది. పోలీసుల అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన మరో పిటిషన్ (క్వాష్ పిటిషన్)పై విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

వివరాలు 2లో..

## జే బ్రాండ్లతో లివర్, కిడ్నీ సమస్యలతో వేల మంది ప్రాణాలు కోల్పోయారు

- జగన్ లిక్కర్ వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారన్న రవీంద్ర
- డిస్టిలరీలు, మద్యం షాపులను హస్తగతం చేసుకున్నారని మండిపాటు
- నూతన ఎక్సైజ్ పాలసీకి తాము శ్రీకారం చుట్టామని వెల్లడి

వివరాలు 2లో..



## మహిళల బట్టలు కూడా ఊడదీస్తామనే విధంగా జగన్ మాటలు ఉన్నాయి

- పోలీసుల బట్టలు ఊడదీస్తామన్న జగన్
- మహిళల మనోభావాలు దెబ్బతీసేలా జగన్ మాటలు ఉన్నాయన్న భవాని
- ఈ వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:**పోలీసుల బట్టలు ఊడదీస్తామన్న వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలపై ఏపీ పోలీసు అధికారుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించిన పోలీసు అధికారుల సంఘం జగన్ వ్యాఖ్యలను ఖండించింది. ఈ సందర్భంగా మహిళా

వివరాలు 2లో..



## జగన్ ను లేకుండా చేయాలనే కుట్ర జరుగుతోంది

- జడ్ ప్లస్ సెక్యూరిటీలో ఉన్న జగన్ కు కనీస భద్రత కూడా కల్పించడం లేదన్న శ్రీకాంత్ రెడ్డి
- జగన్ ఇంటి వద్ద కూడా సరైన భద్రత లేదని విమర్శ
- జగన్ ను పులివెందుల ఎమ్మెల్యే అంటున్నారని అనితపై మండిపాటు
- అన్యాయంగా పనిచేస్తున్న పోలీసుల గురించే జగన్ మాట్లాడారని వ్యాఖ్య
- పలువురు ఐపీఎస్ లకు పోస్టింగ్ లు కూడా ఇవ్వలేదని విమర్శ



వివరాలు 2లో..

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త... గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు గ్రీన్ సిగ్నల్

- హైదరాబాద్, అమరావతి మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే
- తాజాగా రోడ్డు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఏపీ, తెలంగాణ మధ్య కనెక్టివిటీని పెంచేందుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం



**పెన్ పవర్ డెస్క్:** కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలకు శుభావార్త చెప్పింది. ఏపీ, తెలంగాణ మధ్య కనెక్టివిటీని పెంచేందుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్, అమరావతి మధ్య దీన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా తాజాగా రోడ్డు

వివరాలు 2లో..

## ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ కేడర్ వినాశనమే లక్ష్యంగా ఏపీ అధికారులు పనిచేస్తున్నారని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి మండిపడ్డారు. అక్రమ కేసులు పెట్టి వైసీపీ నేతలను అరెస్ట్ చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాక్షసానందం పొందుతోందని అన్నారు. అన్నీ గుర్తు పెట్టుకుంటామని, అందరినీ గుర్తు పెట్టుకుంటామని... అక్రమ కేసులు పెడుతూ, వేధింపులకు గురి చేస్తున్న ఎవరినీ ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషాను కడపలో అవినాశ్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినాశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంజాద్ బాషా సోదరుడు అహ్మద్ బాషాను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అంజాద్ బాషాను అవినాశ్ పరామర్శించారు. తీవ్రవాది మాదిరి

వివరాలు 2లో..

- మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషాను పరామర్శించిన అవినాశ్
- అంజాద్ బాషా సోదరుడు అహ్మద్ బాషాను అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపాటు
- కూటమి ప్రభుత్వం రాక్షసానందం పొందుతోందని మండిపాటు

## ఢిల్లీ ఏపీ భవన్ లోని పౌరసరఫరాల శాఖ దుకాణంలో మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీ



- బియ్యం నాణ్యతను పరిశీలించిన మంత్రి నాదెండ్ల
- బియ్యం బస్తా తూకంలో తేడా రావడంతో సిబ్బందిపై ఆగ్రహం
- ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న దుకాణం సీజ్
- ఇకపై ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే దుకాణం నడుస్తుందని ప్రకటన

వివరాలు 2లో..

## టీడీపీ పగ్గాలు లోకేశ్ కి అప్పగించాలి

- మరోసారి వర్మ వ్యాఖ్యల కలకలం
- కాకినాడ జిల్లా టీడీపీ ఆఫీసులో ప్రజాదర్బార్
- లోకేశ్ యువగళం పాదయాత్ర పార్టీ విజయానికి దోహదం చేసిందని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలని ఇటీవల వ్యాఖ్యానించి కలకలం రేపిన వర్మ... తాజాగా లోకేశ్ కు టీడీపీ పగ్గాలు అప్పగించాలని అన్నారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడుతూ... పార్టీకి లోకేశ్ నాయకత్వం ఎంతో అవసరమని, లోకేశ్ తెలుగుదేశం పార్టీ

వివరాలు 2లో..



## పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు... కేంద్రంపై కేటీఆర్ ఆగ్రహం


- ఇంధన ధరల పెంపు ప్రజల జీవితాన్ని అతలాకుతలం చేసిందని విమర్శ
- పాక్ సహా వివిధ దేశాల కంటే పెట్రోల్ ధరలు మన దేశంలోనే ఎక్కువగా ఉన్నాయన్న కేటీఆర్
- అధిక ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోందని విమర్శ

**పెన్ పవర్ డెస్క్:**కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవనాన్ని

వివరాలు 2లో..



## ఐఏఎస్ అధికారి రొనాల్డ్ రాస్‌కు క్యాట్‌లో ఊరట.. తెలంగాణకే కేటాయింపు




- విభజన సమయంలో ఏపీకి కేటాయించిన డీవోపీటీ
- క్యాట్‌ను ఆశ్రయించి పదేళ్లు తెలంగాణలో విధులు నిర్వర్తించిన రొనాల్డ్ రాస్
- మరోసారి క్యాట్‌ను ఆశ్రయించడంతో రొనాల్డ్ రాస్‌కు అనుకూలంగా తీర్పు

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

# పవర్ కోసం ప్రతిపక్షాల పాకులాట

మూడేళ్లలో మేము పవర్ లోకి వస్తున్నాం . మీ సంగతి చూస్తాం.ఇంకా నాలుగేళ్ల టైముంది. కళ్ళు మూసుకుంటే నాలుగు రోజులుగా అయిపోతాయి. మళ్ళీ మనమే పవర్ లోకి వస్తాం .రాగానే వాళ్ల తోలు తీస్తాను. ఆ ఎస్ ఐ పేరు గుర్తుపెట్టుకోండి . మూడేళ్ల తర్వాత పవర్ లోకి రాగానే వాడిచేత మీకు సెల్యూట్ కొట్టిస్తా. తెలుగు రాష్ట్రాల్లో ఈమధ్య బాగా వినబడుతున్న మాటలు ఇవి. ఏపీలో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి, తెలంగాణలో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిరోజు మూడేళ్లలో పవర్ లోకి వచ్చేస్తాం రాగానే వాడి సంగతి చూస్తాం. వీడి సంగతి చూస్తాం . అది కట్టిస్తాం . ఇది పడగొడతాం అని హామీల మీద హామీలు ఇస్తున్నారు.లో ఉన్న ఈ పొలిటికల్ పార్టీల ధైర్యం ఏమిటో మాత్రం ఎవరికి అర్థం కావటం లేదు. క్యాడర్ లో ఊపు తేవడానికి , నమ్మకం కలిగించడానికి ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారా .? లేక అధికార పక్షాన్ని బెదిరించి మైండ్ గేమ్ ఆడుతున్నారా అన్నది జనంలో చర్చ నడుస్తోంది. ప్రభుత్వం చేస్తున్నది తప్పు అని అనిపిస్తే ఆ తప్పుని అడ్డుకోవడంపై విపక్షాలు దృష్టిపెట్టడం లేదు. మేము వచ్చాక అలా చేస్తాం, ఇలా చేస్తాం అని బెదిరించడం చాలా మామూలు అయిపోయింది. అంటే మూడేళ్ల తర్వాత వీళ్ళు వస్తే మళ్లీ పగ ప్రతీకారాలు కొనసాగుతాయన్నమాట.ఇప్పుడు వాళ్ళని వీళ్ళు వేసుకుంటారు. మూడేళ్ల తర్వాత వీళ్లు వాళ్ళని వెంటాడుతారు అన్నమాట. అధికారంలోకి వస్తే ఏం చేస్తాము అన్నది పొలిటికల్ పార్టీలేవి చెప్పడం లేదు. రెండు మూడేళ్లలో మేము అధికారంలోకి వచ్చేస్తున్నాం . మేము ఆ బుక్ లో రాస్తున్నాం ఈ బుక్ లో రాస్తున్నాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. తెలుగు రాష్ట్రాల్లో అన్ని పార్టీలు ఒక రౌడీ గ్యాంగ్ లాగా తయారయ్యాయి. అసలు వీళ్ళ కాన్ఫిడెన్స్ ఏంటో అర్థం కాదు. ముఖ్యంగా ఏపీలో జగన్మోహన్ రెడ్డి కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఆరో నెలలోనే మొదలుపెట్టేశారు. నెక్స్ట్ మనమే అధికారంలోకి వస్తాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. ప్రభుత్వానికి నాలుగున్నర సంవత్సరాలు సమయం ఉంది.164 సీట్లు ప్రభుత్వానికి ఉన్నాయి. నాలుగేళ్ల తర్వాత ఏం జరుగుతుందో ఎవడికి ఏం తెలియదు. అసలు ప్రభుత్వం ఏర్పడి ఇంకా 9 నెలలు మాత్రమే అయింది. కానీ జగన్మోహన్ రెడ్డి అప్పుడే తొందరపడి పోతున్నాడు. నాలుగేళ్లలో మనమే అధికారంలోకి రాబోతున్నాం రాగానే . వాడి సంగతి తెలుస్తాను. వీడి సంగతి తెలుస్తాను అని హెచ్చరిస్తూ ఉంటారు. ముఖ్యంగా పోలీసు అధికారుల్ని%ొా%. జగన్ పేరు పెట్టి మరి ఓ వీధి రౌడీలాగా వార్నింగ్ ఇస్తూ ఉంటారు.సరే కార్యకర్తలకు కాన్ఫిడెన్స్ నింపడానికి . మనం అధికారంలోకి రాబో తున్నాం ధైర్యంగా ఉండండి అని చెప్పొచ్చు. ప్రభుత్వాలు నిన్ను గాక మొన్న ఏర్పడ్డాయి. ఆంధ్రాలో గట్టిగా 9 నెలలు అవ్వలేదు.అప్పుడే జగన్ 2029 లో నేనే అధికారంలోకి వస్తానని పాట పాడుతున్నాడు. ఆయనకు అంత తొందర ఎందుకో అర్థం కాదు. అధికారం లేకుండా ఉండలేకపోతున్నాడా? లేక నిత్యం భ్రమల్లో%ొా%. ఊహల్లో బతుకుతున్నాడఇక తెలంగాణ విషయానికొస్తే బి ఆర్ ఎస్ అంచనాలకు మించి ఓవర్ కాన్ఫిడెన్స్ తో ఉంది. రేవంత్ సర్కార్ వైఫల్యాలు బి ఆర్ఎస్ లో విశ్వాసాన్ని నింపేసేయ్. ఎన్నికలకు ఇంకా మూడున్నర సంవత్సరాలు సమయం ఉంది. అయినా సరే టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆగలేకపోతున్నారు. అసలు రేపు ఎల్లుండో ఎన్నికలు జరిగిపోతున్నట్టతాము తిరిగి అధికార పీఠాల్లోకి ఎక్కి కూర్చున్నట్లు వీరావేశంతో హామీలు ఇస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పక్కనే ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ స్థలం విషయంలో

ఒక పక్క ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం వివరణ ఇస్తుండగానే . మరోవైపు కేటీఆర్ కాంగ్రెస్ ఏం మాయ చేసినా సరే అక్కడ స్థలాలు ఎవరూ కొనవద్దు. మరో మూడు ఏళ్లలో మన ప్రభుత్వం వస్తుంది ఆ స్థలాన్ని మేము వెనక్కి లాక్కుంటాం అని హెచ్చరిస్తారు. ఆ 400 ఎకరాలు మన ప్రభుత్వం ఎకో పార్క్ కట్టిస్తుంది హామీ ఇచ్చేస్తారు.ఆంధ్ర, తెలంగాణలో ప్రతిపక్షాల ధైర్యం ఏంటో అర్థం కాదు. గతంలో ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాము. ముఖ్యమంత్రిగా పని చేసాము. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాము. మర్యాదగా మాట్లాడాలి. అన్న ధ్యాస ఏ కొసానా లేదు. మూడేళ్లలో మేం అధికారంలోకి వస్తున్నాము. నాలుగేళ్లలో పవర్ లోకి వస్తాము. వాడి తోలు తీస్తాము. వీడు తోలు తీస్తాము. ఆ బుక్ లో రాస్తున్నాము ఈ బుక్ లో ఎక్కిస్తున్నాము . ఇలా ఒక రౌడీ గ్యాంగులు తరహాలో హెచ్చరికలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతీకార రాజకీయాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది.దీనికి ప్రధాన కారణం ఏ ప్రభుత్వమైనా ఐదేళ్లకు మించి ఉన్నదని అందరి నమ్మకం. వేలకోట్ల రూపాయలు అప్పులు తెచ్చి సంక్షేమ పథకాల అమలు చేస్తూ . ప్రజలను సంతృప్తి పరచలేక కచ్చితంగా ప్రభుత్వంలో ఉన్న ఏ పార్టీ అయినా ఐదేళ్లకు ఓడిపోక తప్పదు . కనుక జనం ప్రచారం న్యాయంగా మళ్ళీ మనకే ఓటేస్తారు . అందుకే అధికారం మనకు వచ్చేస్తుంది అనే ధీమాతో . ఓడిపోయిన మరుసటి రోజు నుంచే సిగ్గు ఎగ్గు లేకుండా మళ్లీ మనదే అధికారం అని చెప్పు తిరుగుతుంటాయి పార్టీలు. అసలు ప్రజలు మనల్ని ఎందుకు ఓడించారు . వేరే వాళ్ళకి ఎందుకు అధికారమిచ్చారు అన్న సమీక్ష చేయకుండా ప్రభుత్వాలకి ఏడాది నిండకుండానే వీళ్లు వచ్చే ఎన్నికల్లో మాదే అధికారంలో ప్రకటనలు చేస్తున్నారు.

# నవనీత కృష్ణాలంకారంలో రామయ్య ముగ్ధమనోహర రూపం





- మొదటి పేజీ తరువాయి

కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.పురాణాల ప్రకారం.. కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ నటేష్ బాబు, సూపరిం టెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





## జే బ్రాండ్లతో లివర్, కిడ్నీ సమస్యలతో వేల మంది ప్రాణాలు కోల్పోయారు

పెన్ పవర్ డెస్క్:ఎక్సైజ్ వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన జగన్... లిక్కర్ వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారని చెప్పారు. కొత్త ఎక్సైజ్ పాలసీ పేరుతో వ్యవస్థను విచ్ఛిన్నం చేశారని దుయ్యబట్టారు. తిరుపతిలో పద్మావతి యూనివర్సిటీలో నిర్వహించిన ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిస్టిలరీల దగ్గర నుంచి మద్యం షాపుల వరకు మొత్తం హస్తగతం చేసుకున్నారని రవీంద్ర మండిపడ్డారు. జే బ్రాండ్ మద్యంతో లివర్, కిడ్నీ సమస్యలతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీకి శ్రీకారం చుట్టిందని చెప్పారు. డ్రా నిర్వహించి అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాలను కేటాయించామని తెలిపారు. గంజాయి నిర్మూలనకు ఈగిల్ టీమ్ లను ఏర్పాటు చేశామని చెప్పారు.

## మహిళల బట్టలు కూడా ఊడదీస్తామనే విధంగా జగన్ మాటలు ఉన్నాయి

- మొదటి పేజీ తరువాయి

పోలీసు అధికారిణి భవాని జగన్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. “పోలీసులందరి బట్టలు ఊడదిస్తానని మాజీ ముఖ్యమంత్రి జగన్ అన్న మాటలు... మహిళా పోలీసుల బట్టలు కూడా ఊడదీస్తామనే విధంగా ఉన్నాయి. మహిళల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయి. పోలీసుల్లో మహిళలు కూడా ఉన్నారనే విషయం జగన్ కు తెలియదా? ముఖ్యమంత్రిగా పని చేసిన మీరే ఇలా మాట్లాడితే... పబ్లిక్ లో అందరూ ఏమనుకుంటారనే దాన్ని మీరే ఆలోచించాలి. తన వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకోవాలని పోలీసు అధికారుల సంఘం తరపున డిమాండ్ చేస్తున్నా” అని చెప్పారు.

## పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు... కేంద్రంపై కేటీఆర్ ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

దుర్భరం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ వంటి దేశాలతో పోలిస్తే మన దేశంలోనే పెట్రోల్ ధరలు అధికంగా ఉండటం శోచనీయమని అన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి కేటీఆర్ లేఖ రాశారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలను తగ్గించకపోవడం విమర్శలకు తావిస్తోందని అన్నారు. కేంద్రం విధిస్తోన్న సెస్సుల కారణంగా రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ‘మినిమం గవర్నమెంట్, మ్యాగ్జిమమ్ గవర్నెన్స్’ అనేది కేవలం నినాదంగా మిగిలిపోయిందని, ‘మ్యాగ్జిమమ్ ట్యాక్సేషన్, మినిమమ్ రిలీఫ్’ అన్న చందంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన ఎద్దేవా చేశారు.పెట్రోల్ ధరలను సెస్సుల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం ప్రజలను ఆర్థికంగా దోపిడీ చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

పన్నుల రూపంలో రాష్ట్రాలకు రావాల్సిన న్యాయమైన వాటాను ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. దేశ ఆర్థికాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం గణనీయంగా సహకరిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అరకొర నిధులతో నెట్టుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. అధిక ఆదాయం సమకూరుస్తున్న రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోందని ఆరోపించారు.

## జగన్ ను లేకుండా చేయాలనే కుట్ర జరుగుతోంది

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను లేకుండా చేయాలని చూస్తున్నారంటూ ఆ పార్టీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. జగన్ పర్యటనల్లో భద్రతా వైఫల్యాలు కనిపిస్తున్నాయని అన్నారు. జడ్ ప్లస్ రక్షణలో ఉన్న జగన్ కు కనీస భద్రత కూడా కల్పించడం లేదని విమర్శించారు. జగన్ ను లేకుండా చేయాలనే లక్ష్యంతో కుట్రపూరితంగా ఇలా చేస్తున్నారని అన్నారు. జగన్ ఇంటి దగ్గర కూడా సరైన భద్రతను కల్పించడం లేదని మండిపడ్డారు. ఒక మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతపక్ష నేతగా, ఒక పార్టీ అధ్యక్షుడిగా జగన్ ను చూడటం లేదని విమర్శించారు. జగన్ పర్యటనల గురించి ముందస్తు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. మండలానికి ఒకరిని చంపితే కానీ భయం రాదనే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. అన్యాయంగా వ్యవహరిస్తున్న పోలీసుల గురించి మాత్రమే జగన్ మాట్లాడారని... నిజాయతీగా పనిచేసే పోలీసులకు తాము సెల్యూట్ చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ముగ్గురు డీజీ స్థాయి అధికారులకు పోస్టింగ్ లు ఇవ్వకుండా వేధిస్తున్నారని అన్నారు. పలువురు ఐపీఎస్ లకు పోస్టింగ్ లు

ఇవ్వలేదని... దాదాపు 200 మంది పోలీసు అధికారులను వీఆర్ లో పెట్టారని మండిపడ్డారు. దీనిపై పోలీసు సంఘాల నేతలు మాట్లాడాలని అన్నారు. 11 వందల మంది పోలీసులతో జగన్ పర్యటనకు భద్రత ఏర్పాటు చేశామని హోం మంత్రి అనిత చెప్పడం కరెక్ట్ కాదని చెప్పారు. మాట్లాడితే పులివెందుల ఎమ్మెల్యే అని అనిత అంటున్నారని... ఆయన ఒక మాజీ ముఖ్యమంత్రి అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. డ్రామాలు చేయాల్సిన అవసరం తమకు లేదని... జగన్ వచ్చిన హెలికాప్టర్ ను జనాలు ఎలా చుట్టుముట్టారో చూడాలని చెప్పారు.

## ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు

- మొదటి పేజీ తరువాయి

అహ్మద్ బాషాను ముంబైకి వెళ్లి తీసుకొచ్చారని మండిపడ్డారు. అహ్మద్ బాషాను అరెస్ట్ చేసిన తర్వాత టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం దారుణమని అన్నారు. తప్పుడు కేసు పెట్టి అహ్మద్ ను అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కడపలో టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

## టీడీపీ పగ్గాలు లోకేశ్ కి అప్పగించాలి

- మొదటి పేజీ తరువాయి

రథసారథిగా నియమించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. లోకేశ్ యువగళం పాదయాత్రతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారని, అది పార్టీ విజయానికి దోహదం చేసిందని వర్మ అన్నారు. అంతేకాకుండా పార్టీ భవిష్యత్తు కోసం 2047 ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. లోకేశ్ నాయకత్వానికి కార్యకర్తలు సంపూర్ణ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

మంత్రి నారా లోకేశ్ చాలాకాలంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా, పల్లా శ్రీనివాసరావు ఏపీ టీడీపీ చీఫ్ గా ఉన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త... గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజీ తరువాయి

నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డీపీఆర్‌లు సిద్ధం చేసి పనులు ప్రారంభించనుంది. అటు, త్వరలోనే అమరావతి రింగ్ రోడ్డు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ ఆర్ఆర్‌కు ఉత్తరభాగం నుంచి హైవే నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

## ఢిల్లీ ఏపీ భవన్ లోని పౌరసరఫరాల శాఖ దుకాణంలో మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీ

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీలోని ఏపీ భవన్ లో ఉన్న పౌరసరఫరాల శాఖ దుకాణాన్ని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ అందుబాటులో ఉంచిన బియ్యం నాణ్యతను పరిశీలించారు. బియ్యం బస్తా తూకంలో తేడా రావడంతో సిబ్బందిపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖ పేరుతో ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న ఆ దుకాణాన్ని సీజ్ చేశారు. ఏపీ భవన్ లో నెల రోజుల్లో ప్రభుత్వ దుకాణం ఏర్పాటు చేస్తామని మంత్రి అక్కడిక్కడే ప్రకటించారు. ఇకపై ఏపీ భవన్ లోని దుకాణం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలోనే నడుస్తుందని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మంత్రి నాదెండ్లతో పాటు పౌరసరఫరాల శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ కూడా పాల్గొన్నారు.

## ఐఏఎస్ అధికారి రొనాల్డ్ రాస్‌కు క్యాట్‌లో ఊరట.. తెలంగాణకే కేటాయింపు

పెన్ పవర్ డెస్క్:సీనియర్ ఐఏఎస్ అధికారి రొనాల్డ్ రాస్‌కు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించింది. ఆయన తెలంగాణ రాష్ట్రంలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. విభజన సమయంలో రొనాల్డ్ రాస్‌ను డీవోపీటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించింది. క్యాట్‌ను ఆశ్రయించి దాదాపు పదేళ్ల పాటు తెలంగాణలోనే విధులు నిర్వర్తించారు. అయితే, గత ఏడాది డీవోపీటీ తిరిగి కొంతమంది ఐఏఎస్‌లను ఏపీకి కేటాయించింది. డీవోపీటీ ఆదేశాల మేరకు రొనాల్డ్ రాస్ గత ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేశారు.అయితే, తనను తెలంగాణలోనే కొనసాగించాలంటూ ఆయన మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్ తెలంగాణలో కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేసింది.క్యాట్‌లో ఏఐఎస్ అధికారి శివశంకర్ కంటెంప్ట్ పిటిషన్

క్యాట్ ఆదేశాలను డీవోపీటీ అమలు చేయడం లేదంటూ ఐఏఎస్ అధికారి శివశంకర్ క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. శివశంకర్‌ను ఏపీకి కేటాయించాలని, నాలుగు వారాల్లో ఉత్తర్వులు జారీ చేయాలని డీవోపీటీని క్యాట్ ఆదేశించింది. డీవోపీటీ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఆయన మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. డీవోపీటీ గడువు కోరడంతో నాలుగు వారాల్లో ఉత్తర్వులు ఇవ్వాలని మరోసారి క్యాట్ ఆదేశించింది.

## సీఎం చంద్రబాబు ఇంటి నిర్మాణానికి భూమిపూజ..

- మొదటి పేజీ తరువాయి

వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ కీలకమైన ప్రాజెక్టును ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. సచివాలయం వెనుక E9 రహదారి పక్కన 1,455 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ జి ప్లస్ 1 భవనం డిజైన్, నిర్మాణ పనులను ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పర్యవేక్షించ నుంది. ఏడాదిలోపు ఈ నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఈ నిర్మాణ ప్రక్రియను పర్యవేక్షిస్తారని సమాచారం. ఇప్పటికే హైదరాబాద్, నారావారిపల్లెలో నివాసాలు కలిగి ఉన్న చంద్రబాబు, ఇప్పుడు రాష్ట్ర రాజధాని అమరావతిలో సొంతిల్లు నిర్మించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉండగా, కుప్పంలో కూడా ఆయన మరో నివాసాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ గతంలో చేపట్టిన పెద్ద ప్రాజెక్టుల అనుభవం దృష్ట్యా, చంద్రబాబు తన కొత్త ఇంటి నిర్మాణ బాధ్యతలను వారికి అప్పగించినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ నిర్మాణానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి.

## మెగా డిఎస్సీ పరీక్షల
# ఉచిత ఆన్ లైన్ శిక్షణ

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 09**

మెగా డిఎస్సీ–2025 ఉచిత ఆన్ లైన్ శిక్షణ కొరకు ప్రకాశంజిల్లా కు చెందిన అభ్యర్ధులైన బిసి, ఈ.డబ్ల్యూ.ఎస్ (ఈబిసి), ఎస్టీ అభ్యర్ధుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఒంగోలు బి.సి.స్టడీ సర్కిల్ సంచాలకులు యం.అంజల ప్రకటనలో తెలిపారు. మెగా డి.ఎస్సీ–2025 ఉచిత ఆన్ లైన్ శిక్షణకు దరఖాస్తు చేయు అభ్యర్ధులు తప్పని సరిగా టెట్ లో అర్హత సాధించి ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్ధులు తమ విద్యార్హత నకలు ,, టెట్ మార్కుల నకళ్లు, కులధృవీకరణ పత్రం నకలు, ఆదాయ ధృవీకరణ పత్రం నకలు (సంవత్సరమునకు లక్ష రూపాయలకు మించరాదు), ఆధార్ నకలు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో జిల్లా కలెక్టరు వారి కార్యాలయము ఎదురుగా ఉన్న గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్ లో ఉన్న ఎ.పీ.బి.సి.స్టడీ సర్కిల్, ఒంగోలు నందు దరఖాస్తు చేసుకొనవలసినదిగా తెలియజేశారు. ఇతర వివరములకు ఎ.సి.బి.సి.స్టడీ సర్కిల్, ఒంగోలు, ప్రకాశం జిల్లా ఆఫీసు ఫోన్ నెంబర్– 08592-231232, 9989285530, 8985090926 ను సంప్రదించాలని తెలిపారు.

పెన్ పవర్
ప్రకాశం

## త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా
# ముందస్తు చర్యలు చేపట్టాలి

**– ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి**
**– కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై అధికారులతో సమీక్ష**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 09**

ఈ వేసవి కాలంలో జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు పటిష్టంగా చేపట్టాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్లో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) జరిగింది. ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తో కలసి జాతీయ ఉపాధి హామీ పథకం, జల జీవన్ మిషన్ కార్యక్రమం, పీఎం సూర్య ఘర్ పథకం, పీఎం గ్రామీణ సడక్ యోజన, పీఎం ఆవాస్ యోజన పథకాల కింద పేదలకు మంజూరు చేసిన గృహ నిర్మాణాల పురోగతి, అమృత్ 1, అమృత్ 2 పథకాల ద్వారా ప్రజలకు త్రాగునీటి పథకాలు అమలు, పురోగతిపై శాఖల వారీగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కనిగిరి, సంతనూతలపాడు శాసన సభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, శ్రీ బి.ఎన్. విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ, ఎంపిపి.లు, జడ్పిటిసి లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, పురోగతి పై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ వేసవి కాలంలో జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు పటిష్టంగా చేపట్టాలన్నారు. ప్రజలతో పాటు మూగ జీవాలకు కూడా త్రాగు నీరు అందించే లక్ష్యంతో నిర్మించే పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు త్వరగా పుర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రాబోవు 3 నెలలకు (ఏప్రిల్– జూన్) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లా లోని ఉపాది కూలీలకు 1.11 కోట్ల పని దినాలను 2.95 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా లక్ష్యాలు నిర్దేశించడమైనదని, తదనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా చేపట్టబోయే పంచ ప్రాధాన్యాలైన పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టుట,






నిర్దేశించిన లక్ష్యం మేరకు ఫారం పాండ్ల నిర్మాణం పూర్తి చేయుట, పంట కాలువ పూడిక తీయుట, సాగు నీటి చెరువులు పూడిక తీయుట, అలాగే సగటు కనీస వేతనం రోజుకు 290 -300/- రూపాయలు తగ్గకుండా ఉండేలా కృషి చేయాలని డ్వామా అధికారులను ఆదేశించినట్లు పార్లమెంట్ సభ్యులు తెలిపారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం పటిష్టంగా అమలు జరిగేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి కొళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. జిల్లాలో జల జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ పథకాల కింద చేపట్టిన కార్యక్రమాలను సత్వరం పూర్తిచేసి నిర్దేశించిన లక్ష్యాలు సాధించేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, ఈ నెల 8వ తేదీ నుండి 22 వ తేదీ వరకు 15 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ్ పఖ్వాడా) రోజుకు ఒక కార్యక్రమంతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులను కోరడం జరిగింది. మొదటి 1000 రోజుల వరకు బేబి సంరక్షణపై శ్రద్ధ వహించుట, లబ్ధిదారులు






స్వయంగా తమంతట తామే పోషన్ ట్రాకర్ లో నమోదు చేసుకునే విధానం పట్ల ప్రచారం చేయుట, పిల్లలలో పోషకాహార లోపం నివారించడం, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా చేయడం, ముఖ్యంగా రక్తహీనత కలిగిన కిషోర భాలికలపై, హై రిస్క్ ప్రేగ్నేట్స్, ఉబకాయ పిల్లలు, బరువు తక్కువ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అవసరమైన పౌష్టికాహారం అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ దిశ సమావేశంలో ప్రజాప్రతినిధులు ఏఏ సమస్యలను, అంశాలను ప్రస్తావించారో, ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ, నగరంలోని పోతురాజు కాలువ, నల్ల కాలువల్లో పుడిక తీత పనులు చేపట్టాల్సిన అవసరం వుందని కోరారు. అలాగే అమృత పథకం కింద ఒంగోలు నగరంలో చేపట్టిన పైప్ లైన్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నవని, వాటిని త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కనిగిరి శాసన సభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి మాట్లాడుతూ, కనిగిరి ప్రాంతం ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమని, ఈ ప్రాంత ప్రజలు త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, త్రాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో







ఉపాధి హామీ పథకం కింద కొత్త వాటర్ షెడ్స్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. గత ప్రభుత్వ కాలంలో నిర్మించిన అముల్ సెంటర్స్ ను వినియోగంలోకి తేవాల్సిన అవసరం వుందని, అలాగే అసంపూర్తిగా వున్న సచివాలయాలు, ఆర్ బి కే నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంతనూతలపాడు శాసన సభ్యులు బి.ఎన్. విజయకుమార్ మాట్లాడుతూ, నియోజక వర్గ ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, అమృత పథకం కింద సంతనూతలపాడు నియోజక వర్గ పరిధిలో చేపట్టే పనుల వివరాలు తెల్పాలని ఆయన అధికారులను కోరారు. ఈ సమావేశానికి హాజరైన పలువురు ఎంపిపి లు, జడ్పిటిసిలు ఆయా మండలాలకు సంబంధించిన పలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించడం జరిగింది. బంగారు బాల్యం కార్యక్రమానికి గాను జాతీయ స్థాయిలో జిల్లాకు స్కోచ్ అవార్డు రావడం పట్ల పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా కి పూల మొక్కను బహుకరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా పరిషత్ సి.ఈ. ఓ చిరంజీవి, సి.పి.ఓ వెంకటేశ్వర రావు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం చేసే అబివృద్ధి సంక్షేమం కార్యక్రమాలను
# ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**నిత్యం ప్రజలతో మమేకం కావాలి**
**ప్రత్యర్థుల అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలి**
**స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి**
**విజయాన్ని, సుసాధ్యం చేసిన ఘనత తెలుగుదేశం కార్యకర్తలదే**
**కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త ను పార్టీ గుర్తు పెట్టుకుంటుంది**
**తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే మూలా స్తంభాలు**
**టీడీపీ కార్యకర్తల సమావేశంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల**

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 9**

ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేసే అబివృద్ధి, సంక్షేమ, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలుగుదేశం కార్యకర్తలకు గట్టిగా పిలుపునిచ్చారు. గత వైసిపి పాలనలో రాష్ట్రంలో నియోజకవర్గాల్లో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగకపోగా అవినీతి, అరాచకాలే జరిగాయని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తుంది అన్నారు. గత పాలనలో అనారోగ్యంతో బాధపడే పేదలకు ముఖ్య మంత్రి సహాయం నుండి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆనారోగ్యంతో బాధపడే పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని ఇది వారికి ఒక వరంగా మార్చామని, గృహాలు లేని వారికి పక్కా గృహాలు మంజూరు చేస్తున్నామని, నాడు చెప్పిన మాట ప్రకారం ప్రతి నెల 1వ తేదీన పెంచిన పెన్షన్లు అందజేస్తున్నామని, గ్రామాల్లో రోడ్లు, త్రాగునీటి సమస్యలు పరిష్కారం చేస్తున్నామని, ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని. అయితే చేసిన ప్రతి మంచి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని,కోరారు . కాకుండా ప్రశాంతంగా ఉన్న



రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించేందుకు కొత్త కొత్త ఎత్తుగడల తో ప్రత్యర్థులు ముందుకు వస్తున్నారని , మతం ,కులం రంగులు పులంబోతున్నారని, అశోకరెడ్డి పేర్కొంటూ, కొత్త నినాదం "హిందు పరిరక్షకుడు జగన్" అనేదాంతో ప్రజలను మభ్యపెట్టే వ్యూహంతో వస్తున్నారని, దీని తిప్పికొట్టాలని గ్రామాల్లో అలాంటి దూరాలోచన్లకు తావు లేకుండా కసిమెలసి ఉండాలని తెలిపారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేస్తే ప్రజలే తమకు పట్టం కడతారన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలకు ఇప్పటి నుంచే కార్యకర్తలంతా సమాయత్తం కావాలని ప్రతి గ్రామంలో, ప్రతి బూతులో సమిష్టిగా కృషి చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో అసాధ్యం అనుకున్న విజయాన్ని, సుసాధ్యం చేసిన ఘనత టిడిపి కార్యకర్తలదేనని, టిడిపి కార్యకర్తల కృషి పట్టుదలతోనే నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోనూ తెలుగుదేశం అధికారంలో ఉందని, కష్టపడిన ప్రతి కార్యకర్తను తాను గుర్తు పెట్టుకుంటానని, వారికి తగిన ప్రాధాన్యతను ఇస్తానని తాను ఎల్లప్పుడూ మీ వాడిగా మీఇంటి వాడిగా నీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు క్లస్టర్ ఇన్చార్జ్ లు, మండల నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు
# శక్తి యాప్ పై అవగాహన

**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 09**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు శక్తి టీం ముండ్లమూరు కేజీబీవీ (గర్ల్స్) విద్యార్థినిలకు శక్తి యాప్ యొక్క ప్రాముఖ్యత, ఆవశ్యకత గురించి తెలియజేశారు. శక్తి టీం విద్యార్థినులకు యాప్ గురించి తెలియజేసి, యాప్ డౌన్లోడ్, వినియోగం ఏ విధంగా చేయాలో వివరించారు. శక్తి యాప్ మహిళల భద్రత కొరకు రూపొందించబడిందని, అత్యవసర పరిస్థితులలో పోలీస్ తక్షణ సహాయం అవసరమైనప్పుడు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆపద ఆ సమయంలో ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేసి ఎలా రక్షణ పొందవచ్చునో అవగాహన కల్పించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో యాప్ లోని సేఫ్ ట్రావెల్ అను ఆప్షన్ ఎంచుకొని దానిలో ఎక్కడ నుండి ఎక్కడికి వెళుతున్నారన్న వివరాలు నమోదు చేస్తే వెళు తున్న మార్గాన్ని కంట్రోల్ రూమ్ నుండి ట్రాక్ చెయ్యబడుతుందన్నారు. వెళ్లవలిసిన మార్గంలో కాకుండా వేరే మార్గంలో వాహనం వెళుతుంటే వెంటనే దగ్గరలోని పోలీసులకు సందేశం వెళుతుందని క్షణాల్లో పోలీసులు బాధితురాలు ఉన్న ప్రదేశానికి చేరుకొని రక్షణ కల్పిస్తారని తెలిపారు. ఆపద సమయంలో ఆడ,మగ, చిన్న,పెద్ద అనే వ్యత్యాసం లేకుండా ప్రతి ఒక్కరికి ఉపయోగకరమని ప్రజలకు చెప్పారు. మహిళల భద్రత రక్షణ కోసం శక్తి యాప్ ను తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్ నందు డౌన్లోడ్ చేసుకోవాలని వారికి అవగాహన కల్పించి, యాప్ డౌన్ లోడ్ చేస్తున్నారు. ఆపదలో ఉన్న మహిళలకు శక్తి యాప్ ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుంది.





# 19 న శ్రీగిరిలో వసంతోత్సవం

- ఉదయం శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం,
-సాయంత్రం శ్రీవారికి వసంతోత్సవం..
-ఊంజల సేవ., ఫణిదీప్తి బృందంచే గాత్రకచేరి
- శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 09**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఈ నెల 19 వ తేదీ శని వారం వసంతోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీ వి రామకృష్ణారావు వెల్లడించారు. 19 వ తేది శని వారం ఉదయం 6 గంటలకు శ్రీవారికి సహస్ర నామార్చన, 8,30 నుండి విశేష స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారికి వసంతోత్సవం.. అనంతరం 7.30 లకు శ్రీవారికి ఊంజల సేవ.. బొల్లాపల్లి వెంకట ఫణిదీప్తి బృందంచే గాత్ర కచేరీ జరుగుతాయి. శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి వసంతోత్సవం సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలలో పాల్గొన దలచిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని అలాగే పూర్తి వివరాలకు 9246465282 నంబర్ ను సంప్రదించాలని సూచించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీగిరి శ్రీవెంకటేశ్వర స్వామి వారికి నిర్వహించే వసంతోత్సవం కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

# స్థిరాస్తి కొనుగోలు విషయంలో జాగ్రత్త అవసరం

- జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 09**

అనధికార లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోవాల్సి వస్తుందని జాయింట్ కలెక్టర్ మరియు ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ఆర్.గోపాలకృష్ణ చెప్పారు. స్థిరాస్తి కొనుగోలుదారులు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధి, ఈ విభాగం అందించే సేవలు, అనుమతులు, తదితర వివరాలతో పాటు స్థిరాస్తి కొనుగోలుదారులకు అవసరమైన సూచనలు చేసేలా రూపొందించిన పోస్టర్లను, కరపత్రాలను బుధవారం ప్రకాశం భవనంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, కనిగిరి శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతలతో కలిసి ఆవిష్కరించారు.

## జాతీయ అవార్డు గ్రహీత నరేష్ రెడ్డిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 9**

చంద్రశేఖరపురం పట్టణంలోని ఓం శ్రీ పరాశక్తి తల్లి ట్యూషన్ పాయింట్ మరియు కోచింగ్ సెంటర్ ట్రైనర్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రకాశం జిల్లా అడ్వైజర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ముత్యాల నరేష్ రెడ్డి కి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డు పొందిన సందర్భంగా కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు అభినందించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మునగల వెంకటనారాయణ రెడ్డి, కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ టు చైర్మన్ మూరం మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గత ప్రభుత్వం బోగస్ ప్రభుత్వం

### సమస్యల పరిష్కార్యమే ప్రజా దర్బార్
### ప్రజల మధ్యన ఉండి ప్రజల సమస్యలు తీర్చండి
### ప్రజలను ఇబ్బందీ పెడితే మీరు ఇబ్బందీ పడతారు





**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 9**

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని యర్రగొండపాలెం నియోజకవర్గం ఇన్చార్జి గూడూరీ ఎరిక్షన్ బాబు అన్నారు.పుల్లల చెరువు మండల కేంద్రం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో పుల్లల చెరువు మండల ప్రజల నుంచి బుధవారం వినతులు స్వీకరించారు.ఈ వినతదులపై తక్షణం స్పందిస్తూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ.. పూర్తిగా మంచానికి పరిమితం అయిన వాళ్లకు15000, యాభై శాతం వికలాంగులకు 6000,అవ్వ తాతలకు 4000 పించన్లు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని గుర్తు చేశారు.రాష్ట్రంలో ఎవరైతే నిజమైన లబ్ధిదారులు ఉన్నారో వారినీ గుర్తించి వారందరికీ కూటమి ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేస్తుందన్నారు. పుల్లల చెరువు మండల రెవెన్యూలో చాలా సమస్యలు ఉన్నాయనీ, ఏ గ్రామానికి వెళ్లిన రెవిన్యూ భూమికి సంబంధించి సమస్యలు, తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని ఆయన అన్నారు.పుల్ల చెరువు మండలంలో తహసిల్దార్ డ్యూటీకి సక్రమంగా రావట్లేదనీ, వచ్చిన తాసిల్దార్ 10 రోజులు కూడా ఉండట్లేదు. ఒకవేళ వచ్చిన ఏదో తప్పు చేసి సస్పెండ్ అయిపోతున్నారన్నారు.మండలంలో ఇదొక సమస్య ఉన్నందున ఈ ప్రజా దర్బార్ వచ్చిన అర్జీలు అన్నిటిని మండల స్థాయి అధికారుల ద్వారా కలెక్టర్ దృష్టి తీసుకువెళ్లి వాటినీ పరిష్కరిస్తామని ఆయన అన్నారు.మండల స్థాయి కూటమి నాయకులు ప్రజల్లో ఉండండి ప్రజల సమస్యలను తీర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు. పార్టీలకు అతీతంగా ఏ పార్టీ వాళ్ళు అయినా అందరి సమస్యలు మండలంలో ఉన్న అధికారులు పరిష్కరించాలన్నారు. అధికారులందరూ బాధ్యతగా పనిచేయాలని అన్నారు.విఆర్ఓలు, పంచాయతి సెక్రటరీలు గ్రామాల్లో కీలక పాత్ర పోషించాలన్నారు. ఏ అధికారైతే ప్రజలను ఇబ్బంది పెడతారో...ఆ అధికారి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఏ అధికారైన నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ అధికారులు అందరూ గ్రామాల్లో మా నాయకుల్ని గౌరవించాల్సిందే...వాళ్ళు చెప్పిన పని చేయాల్సిందే దాంట్లో ఎటువంటి అనుమానం లేదనీ అధికారులకు సూచించారు.ప్రజలకు మంచి పరిపాలన ఇవ్వాలనేదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు.రోడ్లు, కాలువల నిర్మాణం వంటి కనీస వసతులపై అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కనీస వసతులను కల్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు.గత ప్రభుత్వం బోగస్ ప్రభుత్వం అని విమర్శించారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు.కార్యక్రమంలో పుల్లలచెరువు ఎంపీపీ కందుల వెంకటయ్య,టిడిపి మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, నీటిసంఘం అధ్యక్షులు కోలుకులూరి కుమార్, సీనియర్ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి,కందుల నారాయణరెడ్డి,కాకర్ల కోటయ్య, ఎస్టి కార్పోరేషన్ డైరెక్టర్ సేవ్య నాయక్,నాయుడుపాలెం ఎంపీటీసీ వెంగయ్య,గజ్వల్లి భాస్కర్, జనసేన మండల కన్వీనర్ కొటారి అచ్చయ్య,జనసేన నాయకులు ఆర్మీ బుజ్జి, ఇంచార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈ వార్డి శ్రీను,స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ అధికారి శామ్యూల్,కూటమి నాయకులు, ప్రజలు,అధికారులు పాల్గొన్నారు.

# పిల్లల పై తల్లిదండ్రుల పర్యవేక్షణ చాలా ముఖ్యం



**కనిగిరి ఆర్సీఇంచార్జి పెన్ పవర్ ఏప్రిల్ 9**

పిల్లల భవిష్యత్తు, సురక్షితం మరియు సమగ్రమైన అభివృద్ధి కోసం తల్లిదండ్రుల పర్యవేక్షణ చాలా ముఖ్యమని గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మంద్రు ప్రవీణ్ కుమార్ అన్నారు.బుధవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని దేవాంగ నగర్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల పర్యవేక్షణ వలన పిల్లలను ప్రమాదాల నుండి కాపాడటం,వారు ఎక్కడ ఉన్నారో,ఎవరితో ఉన్నారో తెలుసుకోవడం ద్వారా వారి భద్రతను నిర్ధారించవచ్చునని తెలిపారు.పిల్లలకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం ద్వారా వారు మంచి నిర్ణయాలు తీసుకునేలా మరియు బాధ్యతాయుతంగా ఉండేలా ప్రోత్సహించవచ్చుని తెలిపారు.పిల్లలకు సరైన నియమాలు మరియు పరిమితులు విధించడం ద్వారా వారు బాధ్యతాయుతంగా మరియు క్రమశిక్షణతో ఉండటానికి సహాయపడుతుందని అన్నారు.పిల్లలు చూసే, ఆడే మరియు ఉపయోగించే మీడియాను అంటే సెల్ ఫోన్ పర్యవేక్షించడం ద్వారా వారు మంచి మరియు తగిన కంటెంట్‌కు మాత్రమే పరిమితం అయ్యేలా చూసుకోవచ్చునని పిల్లలు ఎవరితో సమయం గడుపుతున్నారో తెలుసుకోవడం ద్వారా వారు మంచి స్నేహితులతో మాత్రమే సంబంధాలు కలిగి ఉండేలా చూసుకోవచ్చునని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లల పర్యవేక్షణ ద్వారా వారు బెట్టింగ్, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండేలా చూసుకోవచ్చునని మీ పిల్లలతో ఓపెన్ గా మరియు నిజాయితీగా మాట్లాడండి వారు ఎదుర్కొనే సమస్యలను మరియు వారి ఆలోచనలను తెలుసుకోండం ద్వారా పిల్లలను ఆత్మహత్య ల నుండి కాపాడుకోవచ్చునని అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో బంగారు బాల్యం కమిటీ సభ్యులు,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సాయితత్వ ప్రచారానికి, సేవా కార్యక్రమాలకు కృషి చేస్తాం

**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, ఏప్రిల్ 9**

సాయితత్వ ప్రచారానికి, సేవా కార్యక్రమములకు, మాశక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆంధ్ర రాష్ట్ర శ్రీషిరిడి సాయి ధర్మ పరిరక్షణ సేవ సొసైటీ గౌరవాధ్యక్షులు కందుకూరు మాజీ మంత్రి మానుగుంట మహేందర్ రెడ్డి, గౌరవ సలహాదారులు కనిగిరి మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర శ్రీషిరిడి సాయి ధర్మ పరిరక్షణ సేవా సొసైటీ గౌరవ అధ్యక్షులుగా కందుకూరు మాజీ మంత్రి మానుగుంట మహీధర రెడ్డి , గౌరవ సలహా దారునిగా కనిగిరి మాజీ మంత్రివర్యులు ముక్కు కాశిరెడ్డి సంఘం యొక్క విధులు నిర్వహించుటకు తమ అంగీకారాన్ని తెలియజేసినందుకు రాష్ట్ర కమిటీ కార్యదర్శి గోపాలుని హరిహరరావు, సహాయ కార్యదర్శి దేవకి సుబ్రహ్మణ్యం, ప్రకాశం జిల్లా బాబా ఆలయాల అధ్యక్షులు అలహరి చంచల రావు, కందుకూరు నుండి శ్రీరామ్ మూర్తి, నరసింహారావు, కనిగిరి నుండి ముచ్చర్ల ధర్మారావు, వాగిచెర్ల వెంకటేశ్వర్లు, మహేందర్ రెడ్డిని, ముక్కు కాశిరెడ్డి ఘనంగా



సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షులు సాయి దాసు, ఉపాధ్యక్షులు కర్లపూడి కృష్ణ, సహాయ కార్యదర్శి ఆదిపూడి సాయిరాం, మైలవరం బాలాజీ రావు, శ్రీకాకుళం నాగభూషణం, చిత్తూరు వరలక్ష్మి, వైజాగ్ సత్య కుమార్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

# కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి మానుకొండు ఆదిశేషయ్య మృతి

**కొమరోలు మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేసిన ఆదిశేషయ్య.**
**ముత్తుముల ,వీరం రెడ్డి కుటుంబాలకు విశ్వాసపాత్రునిగా పేరుపొందిన ఆదిశేషయ్య.**
**ఆంజనేయస్వామి, విఘ్నేశ్వర స్వామి ఆలయాలకు ధర్మకర్తగా పనిచేసిన ఆదిశేషయ్య.**
**అనారోగ్యంతో బాధపడుతూ నంద్యాలలోని చిన్న కూతురు ఇంటిలో గుండెపోటుతో మృతి చెందిన ఆదిశేషయ్య.**

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 9**



కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కొమరోలు లోని ఆంజనేయస్వామి విగ్నేశ్వర స్వామి ఆలయాల ధర్మకర్త మానుకొండు ఆదిశేషయ్య 70 అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం నంద్యాలలో మృతి చెందారు. మానుకొండు ఆదిశేషయ్య గతంలో కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు .ఆ సందర్భంగా ఆయన పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. అంతేకాక మాజీ జెడ్పిటిసి సభ్యులు వీరం రెడ్డి రాఘవరెడ్డికి, స్వర్గీయ ముత్తుముల భాస్కర్ రెడ్డి, స్వర్గీయ ముత్తుముల కేశవరెడ్డి, స్వర్గీయ ముత్తుముల రామచంద్రారెడ్డి ,పిడతల కుటుంబాలకు అత్యంత సన్నిహితునిగా, విశ్వాసపాత్రునిగా పేరుపొందారు . కొమరోలు లోని ఆంజనేయస్వామి, విఘ్నేశ్వర స్వామి ఆలయాలకు ధర్మకర్తగా వ్యవహరించి ఆలయాల అభివృద్ధికి కృషి చేశారు. పండుగలు, తిరుణాలలు, ఉత్సవాల నిర్వహణ సందర్భంలో ఆదిశేషయ్య ప్రధాన భూమిక పోషించేవారు. అభ్యుదయ భావాలు కలిగి, అందరితో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ మంచి పేరు ప్రఖ్యాతులు పొందారు. ఆదిశేషయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల నంద్యాలలో ఉన్న చిన్న కూతురు వద్దకు వెళ్లి అక్కడ చికిత్సలు పొందారు. కాగా మంగళవారం సాయంత్రం ఆయనకు గుండెపోటు రావడంతో చిన్న కూతురు ఇంటిలోనే కన్నుమూశారు. ఆదిశేషయ్య మృతదేహాన్ని మంగళవారం అర్ధరాత్రి కొమరోలు లోని ఆయన స్వగృహానికి తరలించారు .ఆ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, విద్యావేత్తలు, పలు సంఘాల ప్రతినిధులు, బంధుమిత్రులు ఆదిశేషయ్య మృదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల కన్నీటి వీడ్కోలు తో ఆదిశేషయ్య అంత్యక్రియలు బుధవారం సాయంత్రం నిర్వహించారు.

## ఈ నెల 21 నుంచి శ్రీగంగాభవాని విగ్రహం, సింహ వాహనం ఆలయ శిఖర ప్రతిష్ట

**23న బురుజుపల్లెలో రాష్ట్ర బండలాగుడు పోటీలు**





**గిద్దలూరు, పెన్ పవర్ ఏప్రిల్ 9**

గిద్దలూరు మండలం బురుజుపల్లె గ్రామంలో శ్రీ గంగాభవాని దేవస్థానంలో గంగాభవాని విగ్రహం,సింహ వాహనం మరియు ఆలయ శిఖర ప్రతిష్టాకార్యక్రమం సందర్భంగా ఈ నెల 23వతేదీన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బలప్రదర్శనలో సత్తా చాటిన ఎడ్ల జతలకు నగదు బహుమతులను ప్రదానం చేస్తారు.దాతల సౌజన్యంతో బహుమతుల్లో మొదటి బహుమతిగా లక్ష రూపాయలు, 80వేలు,60వేలు, 40వేలు, 30వేలు, 20వేలు, 10వేలు, 5వేలునగదు బహుమతులు ఉంటాయి. ఆసక్తి గల ఎడ్ల యజమానులు వెయ్యి రూపాయల ధరావత్తు చెల్లించి పోటీలో పాల్గొనవచ్చు.

**ప్రతిష్ట ఉత్సవం:** 21వతేది సోమవారం గణపతి పూజాదికాలతో ఉత్సవం ప్రారంభం అవుతుంది.

22 మంగళవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం,హోమాలు, గ్రామోత్సవం ఉంటాయి. 23 బుధవారం ప్రతిష్ట ఉత్సవం నిర్వహిస్తారు.

# విద్యార్థులను చేర్పించుటకు అడ్మిషన్ డ్రైవ్

### అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు స్వీకరణ

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 9**

కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాల శీలంవారిపల్లి యందు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులను చేర్పించుట కొరకు అడ్మిషన్ డ్రైవ్ లో భాగంగా బుధవారం నల్లమడుగుల గ్రామంలో పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి అడ్మిషన్ చేసుకున్నారు.ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వ అందిస్తున్న రాయితీలు, సౌకర్యాలు గురించి తెలియపరిచారు. ప్రభుత్వ కళాశాల లో విద్యార్థులను చేర్చి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని విద్యార్థులు తల్లిదండ్రులను కోరారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాగినేని తిరుపతయ్య, అధ్యాపకులు నారిశెట్టి వెంకటరామయ్య,డి. నాగేశ్వరావు, వి. సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.




# ఒంగోలు పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టి - ఎంపి మాగుంట




**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 09**

ఒంగోలు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. దీని ప్రతిపాదనలపై జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియాతో కలిసి బుధవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను తగ్గించడంతో పాటు గ్రానైట్ రవాణా చేసే వాహనాలను నగరం వెలుపల నుంచి మళ్ళించేలా త్రోవగుంట నుంచి పెళ్లూరు వరకూ పశ్చిమం వైపున బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలతో పాటు భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు. అందుకోసమే ప్రాథమికంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాదే పనులు ప్రారంభించేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆయన సూచించారు. సంబంధిత శాసనసభ్యులు అందరినీ సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్ మాట్లాడుతూ సంతనూతలపాడులో ట్రాఫిక్ రద్దీని, గ్రానైట్ రవాణా చేసే హెవీ వాహనాల రాకపోకలను ప్రధానంగా నియంత్రంచాల్సి ఉందన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డి.పి.ఆర్ )ను రూపొందించేటప్పుడు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ నిర్మాణ వ్యయం, సామాజిక, పర్యావరణ, ఇంజనీరింగ్, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలను రూపొందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ వెంకట నాయుడు, ఆర్ అండ్ బి ఎస్.ఈ. దేవానంద్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ. బాల శంకరరావు, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## తెలుగు భాషోత్సవ వేడుకలకు మైనంపాటికి ఆహ్వానం



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 09**

తెలుగు భాషా చైతన్య సమితి, ఆధ్వర్యంలో మే 8వ తేదీ హైదరాబాద్, చిక్కడపల్లి, త్యాగరాయ గాన సభలో , తమ సంస్థ 12వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న జరిగే తెలుగు భాషోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు ఒంగోలుకు చెందిన ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్ కి ఆహ్వానం పంపారు. మైనంపాటి సాయికుమార్ కవి సమ్మేళన విభాగంలో పాల్గొని కవితలను వినిపిస్తారు. ఈ మేరకు తెలుగు భాష చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పి. బడే సాబ్, సమన్వయకర్త డాక్టర్ వి. జయప్రకాష్ ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా మైనంపాటిని నగరానికి చెందిన వివిధ , ధార్మిక ,సాహిత్య కళా సంస్థల ప్రతినిధులు అభినందించారు. ఆయన చేస్తున్న సాహిత్య సేవలను ప్రశంసించారు.

## నాటు సారా నిర్మూలన పై అవగాహన



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 9**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాటు సారా నిర్మూలన కార్యక్రమం నవోదయం 2.0 లో భాగంగా బుధవారం నాడు కొమరోలు మండలం ఎర్రగుంట్ల గ్రామము, గిద్దలూరు మండలం ఓబులాపురం తండా బుర్జుపల్లి తండా, వెంకటాపురం తండా , దిగువమెట్ట గ్రామాలలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎమ్ జయ రావు నాటు సారా వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించేందుకు ప్రచార రథాన్ని ప్రారంభించారు, నాటుసారా ను అశాస్త్రీయ పద్దతులు ఉపయోగించి తయారు చేస్తారని ప్రాణానికి హాని కలిగించే వస్తువులు ఉపయోగించి నాటు సారా తయారు చేస్తారని , నాటు సారా తాగే వ్యక్తులకు కలిగే అనారోగ్య సమస్యలు గురించి ప్రచార రథం ద్వారా ఆయా గ్రామాల ప్రజలలో చైతన్యం కలిగించారు. నాటు సారా తయారు చేయడం,అమ్మకం,రవాణా, ముడి పదార్థాలు అమ్మకం గురించి తెలిసిన సమాచారాన్ని 94409025072 ఫోన్ లేదా వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలియపరచి నాటు సారా తయారీ , అక్రమ మద్యాన్ని అరికట్టుటకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎమ్ . జయ రావు, హెడ్ కానిస్టేబుల్ యూసఫ్ షరీఫ్, సిబ్బంది శ్రీపతి, హరిబాబు , పత్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం భూములను పరిశీలించిన

### అసిస్టెంట్ కమిషనర్ యం. పానకాలరావు



**పామూరు, పెన్ పవర్,ఏప్రిల్9.**

రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్ ఉత్తర్వుల మేరకు పట్టణంలోని నెల్లూరు రోడ్ లో ఉన్నటువంటి శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం కి చెందిన దేవదాసి భూములు సర్వే నంబర్.365/2 లోని 2.19 సెంట్లు 365/3 లోని 2.10 ఎకరాలలో నిర్మించిన శ్రీ నగర్ కాలనీ, అలాగే మద్దెల సర్వీస్ భూములు సర్వే నంబర్ 322/7 లోని 0.56 సెంట్లు 322/11 లోని 0.55 సెంట్లు లోని పెట్రోల్ బంకు, షాపింగ్ కాంప్లెక్స్ ను దేవదాయ శాఖ జిల్లా అధికారి యం. పానకాలరావు, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో నరసింహారావు సిబ్బందితో పరిశీలించారు. ఈ భూములు పరిశీలించి నివేదికను ఉన్నత అధికారులకు ఇవ్వనట్లు అసిస్టెంట్ కమిషనర్ యం. పానకాలరావు తెలిపారు.

## నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

### - డైట్ ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్ ఏప్రిల్ 9**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జిల్లా విద్యా శిక్షణ సంస్థ ( డైట్ ) ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు సూచించారు. కనిగిరి డివిజన్ పరిధిలోని ఆరు మండలాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో బుధవారం ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. నాయకత్వ శిక్షణా కార్యక్రమాల్లో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలని, నైపుణ్యాలు పెంపొందించుకొని వనరులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాలలను అభ్యాస సంస్థగా అభివృద్ధి చేయడానికి సమర్థవంతమైన వ్యూహాలను రూపొందించుకోవాలని అన్నారు. నిరంతర వృత్యంతర అంశాలలో శిక్షణ పొందడం విద్యా శిక్షణ కార్యక్రమాలలో పాల్గొనడం సెమినార్లలో పాల్గొనడం చేయాలన్నారు. విద్యార్థుల మధ్య సామర్థ్య అభివృద్ధిని ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులలో వ్యక్తిత్వాన్ని బలోపేతం చేసేందుకు నాయకత్వం వహించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎస్ ఎల్ డి పి శిక్షణకు సంబంధించిన ఫీడ్ బ్యాక్ ఆచరణ అంశాలను ప్రధాన ఉపాధ్యాయులతో డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు సమీక్షించారు. సమావేశంలో 6 మండలాలకు చెందిన ఎంఈఓలు, ఎస్ ఎల్ డి పి శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### బి సి లకు న్యాయం చేయాలని కోరుతూ

## 11 న కలెక్టరేట్ వద్ద ధర్నా

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 09**

ఈనెల 11న మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి నాడు బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీసీల మహాధర్నా ను నిర్వహించనున్నట్లు బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి ధరణికోట లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని జిల్లా కలెక్టర్ ఆఫీస్ మంచి పుస్తకం వద్ద బీసీలు.. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బీసీల మహాధర్నా ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి ధరణికోట లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ లెక్కలు 52 శాతంగా తేలిందని దాన్ని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కలెక్టర్ల ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బందితో జనాభా లెక్కలు నిర్వహించారని దానిలో బీసీలు 52 శాతంగా తేలిందని, కూటమి ప్రభుత్వం ఎప్పటిలాగే బీసీలకు 36శాతం ఇస్తానని కేంద్రానికి లేఖ రాయటం హాస్యాస్పదం గా ఉందన్నారు. నిజంగా తెలుగుదేశం పార్టీకి బీసీల మీద ప్రేమ ఉంటే ప్రభుత్వం దగ్గర ఉన్నటువంటి బీసీ లెక్కలను బయటపెట్టి స్థానిక సంస్థల్లోనూ, విద్యా, ఉద్యోగాల్లో 52శాతం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా బిసి చైర్మన్ బోట్ల సుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టడం జరిగిందని ఎన్నికల నేపథ్యంలో బీసీ కులగణన లెక్కలు బయటికి రావటం జాప్యం జరిగిందని ఇప్పుడైనా కూటమి ప్రభుత్వం 52 శాతం బీసీకుల లెక్కల ప్రకారం స్థానిక సంస్థల ఎలక్షన్స్ జరపాలని లేనియెడల అన్ని ప్రజాసంఘాలతో కలిసి బీసీల వాటా వచ్చేదాకా ఉద్యమం చేస్తామని తెలియజేశారు. బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు తాటిపర్తి వెంకటస్వామి మాట్లాడుతూ బీసీల న్యాయమైన కోరిక తీరేవరకు బీఎస్పీ పార్టీ బీసీలకు అండగా ఉంటుందని తెలియజేశారు. ఓ.పి.డి.ఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ మాట్లాడుతూ 75 సంవత్సరాల నుంచి బీసీలను మోసం చేయడం ఇక



చాలని, ప్రభుత్వం దగ్గర ఉన్న బీసీ లెక్కలు 52 శాతంను బయటపెట్టి బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలను విద్యా,ఉద్యోగాల్లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం మాట్లాడుతూ 70 సంవత్సరాల నుంచి బీసీలు మోసానికి గురవుతున్నారని వారికోసం ఇండిపెండెంట్ లేబర్ పార్టీ పూర్తి మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. బీసీ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గుంటూరు మస్తాన్ రావు మాట్లాడుతూ ఈనెల 11 కలెక్టర్ ఆఫీస్ దగ్గర జరుగు బీసీల మహాధర్నాన్ని జిల్లాలో ఉన్న బీసీలందరూ పార్టీలకు అతీతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ జిల్లా కో-కన్వీనర్ పెద్దన్న,బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు కుట్టుబోయిన కోటి యాదవ్, బీసీ సమన్వయ కమిటీ జిల్లా కో-కన్వీనర్ కాకుమాను రవిచంద్ర,ఒంగోలు నియోజకవర్గ బీసీ సమన్వయ కమిటీ కన్వీనర్ నాగళ్ళ వీరాంజనేయులు,బీసీ సమన్వయ కమిటీ జిల్లా మహిళా చైర్మన్ దూల దుర్గ భవాని యాదవ్,అప్పారావు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ విజేత కెప్టెన్ శివకు అభినందనలు



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 9**

శ్రీరామ నవమి, అంకాలమ్మ పోలేరమ్మ గ్రామ దేవతల పండుగల సందర్భంగా శీలంవారిపల్లె గ్రామములో ప్రకాశం,నెల్లూరు జిల్లాల స్థాయిలో నిర్వహించిన 22వ ఆర్. సి. సి క్రికెట్ టోర్నమెంటులో లక్కీ లెవెన్ జట్టు అన్ని విభాగాలలో ప్రతిభ చూపించి కెప్టెన్ కదిరి శివ ఆల్ రౌండ్ ప్రతిభతో మొదటి బహుమతి విజేతగా నిలిపిన కదిరి శివను గ్రామస్తులు అభినందించారు ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా అభిమానులు గ్రామస్తులు మా టీం సభ్యులను ప్రోత్సహిస్తూ అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## కంబాలదిన్నె పంచాయతీ కె.ఎస్.ఎస్. జాబితాను అందజేసిన మన్నం రమణయ్య



**పామూరు, పెన్ పవర్,ఏప్రిల్9**

మండలం కంబాలదిన్నె పంచాయతీలోని రేణుమడుగు, రాజాసాయి పేట, కంబాలదిన్నె గ్రామంలో మొత్తం ఐదు బూతులు సంబంధించి కుటుంబ సాధికారకలు, సారధులు జాబితాను పూర్తి చేసి పట్టణంలోని పువ్వాడి వెంకటేశ్వర్లు క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ను కలిసి కంబాలదిన్నె గ్రామకమిటి అధ్యక్షులు మన్నం రమణయ్య, తెదేపా నాయకులతో కలిసి కుటుంబ సాధికారకలు, సారధులు జాబితాను పువ్వాడి వెంకటేశ్వర్లు కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, మోపాడు రిజర్వాయర్ సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, రేణుమడుగు చెరువు చైర్మన్ గద్దేమోహన్, కంబాలదిన్నె యూనిట్ ఇన్చార్జి గోళ్ళ వీరబాబు, మెంటా నరసింహారావు, కమ్మ బాలకృష్ణ, గద్దె వెంకటేశ్వర్లు, తలపనేని కొండలరావు, కంచర్ల శీను, కొండ మనోజ్ తదితరులు వున్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు




**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 9**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు . పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు తెలుగుదేశం కార్యకర్తలు కృష్ణకు పూలమాలలు శాలువాలు వేసి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలోని అన్నా క్యాంటీన్ లో ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టీ ప్యాలెస్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిషోర్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 9**

గిద్దలూరు పట్టణంలోని ఒంగోలు హైవేలో పాములపల్లి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గణేష్ నూతనంగా ఏర్పాటు చేసిన టీ ప్యాలెస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వ్యాపారంలో మంచి అభివృద్ధి సాధించి ఆర్థిక లాభాలతో ముందుకుసాగాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బెల్లం ఊట ధ్వంసం



పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 9

ప్రొహిబిషన్,ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ ఆదేశాలమేరకు మండలంలోని నాటుసారా బట్టీలపై బుధవారం దాడులు నిర్వహించారు.ఈ దాడులలో మండలంలోని నరజాముల తాండా తూర్పువైపు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని అడవి చెట్ల మధ్య 550 లీటర్ల నాటుసారకు ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. మూడు చోట్ల దాడులు నిర్వహించి ముగ్గురు పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. యర్రగొండపాలెం సీసీ, ఒంగోలు ఐఏసీ ఇయన్ఎఫ్టీ మార్కాపురం ఈ ఎస్ టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలి




పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 9

రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం గట్టి చర్యలు చేపట్టాలని సిఐటియు నాయకులు కోరారు పొదిలి పట్టణంలో నీ ఎన్జీవో హోం లో బుధవారం నాడు ఆ సంఘం నాయకులు సయ్యద్ హుస్సేన్ అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది ఈ సమావేశంలో రాష్ట్ర బిల్డింగ్, అధార్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెన్న బాల వెంకట్, సిఐటియు ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ లు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కూటమి ప్రభుత్వం చేర్చినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటు జరి గీ పది మాసాలు దాటుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు కార్మిక వర్గాన్ని నమ్మించి మోసగించడం పాలకులకు పరిపాటిగా మారిందంటూ వారు తీవ్రంగా దుయ్యబట్టారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోని భవన కార్మికుల సంక్షేమానికి గట్టి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె సురేష్, ఏ శ్రీనివాసులు, భావనారాయణ, ఎన్ శ్రీను, వెంకట్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు

# బిజెపి బలోపేతానికి అందరూ గట్టి కృషి చేయాలి





పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 9

భారతీయ జనతా పార్టీ బలోపేతానికి అందరూ గట్టి కృషి చేయాలని జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి పివి కృష్ణారావు కోరారు బుధవారం సాయంత్రం స్థానిక బెల్లంకొండ నగర్ లోని మండల బిజెపి కార్యాలయంలో బిజెపి క్రియాశీలక సభ్యుల సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విజయలక్ష్మి, కృష్ణారావులు మాట్లాడుతూ వార్డుల స్థాయి నుండి పార్టీ బలం పెంచే విధంగా నాయకులు కార్యకర్తలు గట్టి కృషి చేయాలని కోరారు బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న పల్లెకి పోదాం, అభియాన్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం అయ్యే విధంగా అందరూ చూడాలని వారు కోరారు అలాగే బిజెపి పార్టీ సిద్ధాంతాలు, పార్టీ పురోగతికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి, బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు యుద్ధం మహేష్, కొనకనమిట్ల మండల బిజెపి అధ్యక్షులు కే శ్రీనివాసులు, ఎస్ ప్రవీణ్, పి నారాయణ, మాగులూరి నారాయణ, నాగశ్రీ, సిహెచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బికె విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 9వ వార్షికోత్సవ సంబరాలు










చంద్రశేఖరపురం, పెన్ పవర్, ఏప్రిల్ 9

సిఎస్ పురం పట్టణంలోని ఆర్ ఎం ఎస్ కళ్యాణ మండపం నందు బికే విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 9 వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రత్నం విద్యాసంస్థల అధినేత సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ మద్దుల శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సి ఎస్ పురం పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ రుద్రపోగు సుమన్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి క్రమశిక్షణతో కలిగిన విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. అదే విధంగా మరో విశిష్ట అతిథి అయిన టిడిపి మండల అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు బలహీనతలకు లొంగకుండా లక్ష్యాలను చేరుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సి ఎస్ పురం గ్రామ సర్పంచ్ శ్రీమతి శ్రీరామ్ పద్మావతి , ఉప సర్పంచి శ్రీ పాములపాటి నరసయ్య, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ బత్తుల వెంకటాద్రి, బి కే విద్యా మందిర్ హెడ్మాస్టర్ డి సూర్య రత్నం, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సి ఎస్ పురం యన్.వెంకటేశ్, బెల్లంకొండ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ కే నారాయణ, యస్.కె. షరీఫ్, శ్రీ ఆదిత్య జూనియర్ కాలేజ్ పామూరు ప్రిన్సిపల్ ఆర్ నాగరాజు, శ్రీ వీరిశెట్టి జూనియర్ కాలేజ్ పొదిలి డైరెక్టర్ వి కృష్ణంరాజు, ప్రిన్సిపల్ ఎస్ నరసింహారావు, విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొమరోలు సిపిఎం నాయకురాలు కూరాకు అంజమ్మ తల్లి కూరాకు రంగమ్మ మృతి

### సంఘ సేవకురాలుగా గుర్తింపు కూరకు రంగమ్మ.

### అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి పేరు ప్రఖ్యాతలు గడించిన రంగమ్మ.

### ధైర్యానికి యదార్థవాదానికి మరో పేరు కూరాకు రంగమ్మ.

కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 9



కొమరోలు మండలం సిపిఎం నాయకురాలు కూరాకు అంజమ్మ తల్లి కూరాకు రంగమ్మ(80) మంగళవారం రాత్రి మృతి చెందారు. కొమరోలు మండలంలో సంఘ సేవకురాలిగా పేరు ప్రఖ్యాతులు గడించిన కూరాకు రంగమ్మ మృతి చెందినట్లుగా తెలియటంతో పలువురు విచారం వ్యక్తం చేశారు. రంగమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల కడపలోని ఆసుపత్రిలో చేరారు .అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె భౌతికాయాన్ని కొమరోలు తరలించి బుధవారం కుటుంబ సభ్యుల బంధువుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కూరాకు రంగమ్మ ధైర్యానికి, యదార్థవాదానికి చిరునామాగా నిలిచారు .ఆమె అనేక సేవా కార్యక్రమాల నిర్వహించి సమాజానికి తన వంతుగా సేవలు అందించారు. దీనితో కూరాకు రంగమ్మను పలు సందర్భాలలో పలువురు అభినందించారు. ఆలయాల పరిరక్షణకు ,అభివృద్ధికి ఆమె చేసిన సేవలు మరువరానివి. ఆమె భర్త కూరకు గుర్రప్ప కొమరోలు మండపరిషత్ కార్యాలయంలో గతంలో అటెండర్ గా పనిచేసి, పలువురితో మన్ననలు పొందారు. మృతురాలు కూరాకు రంగమ్మ కూతురు కూరాకు అంజమ్మ కొమరోలు మండలంలో సిపిఎం నాయకురాలిగా పనిచేస్తున్నారు. ఆమె కూడా తల్లి వలె యదార్థవాదానికి ,ధైర్యానికి ,నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచి, ప్రజా సమస్యల పరిష్కారానికి తమదైన శైలిలో కృషి చేస్తూ సిపిఎం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. కూరాకు రంగమ్మ మృతి పట్ల సిపిఎం నాయకులు, వైసిపి ,టిడిపి నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు ,విద్యావేత్తలు సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# అదుపు అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

### పలువురు కూలీలకు గాయాలు

కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 9.



విద్యుత్ శాఖకు సంబంధించిన కండక్టర్ తీగ, ఇతర సామాగ్రి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బుధవారం ఉదయం ఎడమకల్లు గ్రామ సమీపంలో రోడ్డు మలుపులో అదుపుతప్పి బోల్తా పడింది .ఆ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ తో పాటు ట్రాలీలో ఉన్న కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. దాదాపు రెండు టన్నుల బరువు ఉన్న విద్యుత్ కండక్టర్ లోడ్ తోపాటు ఇతర సామాగ్రి నింపుకొని కొమరోలు నుంచి రాజుపాలెంలో జరుగుతున్న విద్యుత్ పనుల వద్దకు వెళ్లేందుకు ట్రాక్టర్ బయలుదేరింది. సదరు ట్రాక్టర్ ఎడమ కళ్ళు గ్రామం మీదుగా రాజుపాలెం వెళ్తుండగా ఎడమకలు సమీపంలోని రోడ్డు మలుపును అధిగమిస్తున్న సమయంలో ట్రాక్టర్ ట్రాలీ లో ఉన్న రెండు టన్నుల విద్యుత్ కండక్టర్ తీగ, ఇతర సామాగ్రి అంతా ఒకవైపు రావటంతో ట్రాక్టర్ ట్రాలీ ఒరిగిపోయింది .దీనితో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు ప్రక్కన గల పొలాల్లో బోల్తా పడింది. ఆ సందర్భంగా ర్యాలీలో ఉన్న కూలీలు దూరంగా ఎగిరిపడ్డారు. అదృష్టవశాత్తు వారిపై ట్రాక్టర్ ట్రాలీ లేదా అధిక బరువు ఉన్న కండక్టర్ తీగచుట్టిన చట్రం, ఇతర బరువైన వస్తు సామాగ్రి కూలీలపై పడలేదు. దీనితో కూలీలు ప్రాణాపాయం నుంచి తప్పించుకొని స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ట్రాక్టర్ డ్రైవర్ కూడా స్వల్ప గాయాలతో బయటపడ్డారు .గాయపడిన వారిని 108 వాహనంలో గిద్దలూరు ఆసుపత్రికి తరలించారు.

# నాటుసారా తయారీదారులు మద్యం బెల్ట్ షాపు నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు

### కంభం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిఐ కొండారెడ్డి

### ఆరుగురిపై బైండోవర్ కేసులు నమోదు



బెస్తవారిపేట,పెన్ పవర్ ఏప్రిల్ 9:

బేస్తవారిపేట మండలం లోని కోనపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను మరియు కాజీపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని పాత నేరస్తులు అయినందున బేస్తవారిపేట ఎమ్మార్వో జితేంద్ర కుమార్ వద్ద బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. ఎమ్మార్వో వద్ద బయలు చేసిన ఆరుగురు వారి గ్రామాల్లో మద్యం విక్రయిస్తే రెండు సంవత్సరాలకు రెండు లక్షల రూపాయలు తెలివితే విధంగా బైండ్ వర్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రొహిబిషన్ సీఐ కొండారెడ్డి బైండోవర్ కేసులు నమోదు చేశారు. తదుపరి బేస్తవారిపేట మండల తహసిల్దార్ కార్యాలయంలో నవోదయం 2.% కార్యచరణలో భాగంగా మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో నాటుసారా నిర్మూలించుటకు తదుపరి తీసుకోవలసిన చర్యల గురించి చర్చించడం జరిగినది.ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ బేస్తవారిపేట మండలంలోనీ గ్రామాలలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా, అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, అమ్మినా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ వారికి వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని కొండారెడ్డి తెలిపారు.

# తల్లికి పునర్జన్మనిచ్చి కుమారుడి మృతి

అర్ధవీడు, పెన్ పవర్, ఏప్రిల్ 9

మద్యం మత్తులో భర్త భార్యను పొడవబోయిన కత్తికి కుమారుడు బలయ్యాడు. దీంతో తల్లికి పునర్జన్మనిచ్చి కుమారుడు మృతి చెందాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా అర్ధవీడులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. అర్ధవీడుకు చెందిన షేక్. ఖాసిం వలి తరచూ మద్యం తాగి ఇంటి వద్ద భార్యతో గొడవ పడేవాడు. మంగళవారం రాత్రి కూడా గొడవ పడుతూ కత్తితో తన భార్యను పొడవబోగా కుమారుడు షాకీర్ అడ్డు రావటంతో కతిపోటుకు గురె మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# మైనంపాడు డైట్ లో ఖాళీ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 09

డైట్, మైనంపాడు నందు ఖాళీగా ఉన్న టీచింగ్ ఫ్యాకల్టీ పోస్టు లందు ఎఫ్ఎస్టీస్ క్రింద పని చేయుటకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్స్, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారుల నుండి అప్లికేషన్లు కోరుతూ పాఠశాల విద్య సంచాలకులు, అమరావతి వారి తరపున ఏప్రిల్ 2 ప్రకటన ఇవ్వటం జరిగినదని ప్రిన్సిపాల్, డైట్, మైనంపాడు, ప్రకాశం జిల్లా వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ ల వివరాలు విద్యార్హత వివరాలు జిల్లా విద్యాశాఖాధికారి, ప్రకాశం జిల్లా వారి అధికార వెబ్ సైట్ నందు ఉంచబడినవని, అర్హులైన అభ్యర్థులు వారి యొక్క అప్లికేషను లను ఏప్రిల్ నుండి 10 వ తేదీ వరకు ఆన్లైన్ నందు అప్లై చేసి హార్డ్ కాపీలను ప్రిన్సిపాల్, డైట్, మైనంపాడు, ప్రకాశం జిల్లా వారికీ అందజేయాలని తెలిపారు. దరఖాస్తు చేసుకొను అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ అయితే సంబంధిత ప్రధానోపాధ్యాయుల, మండల విద్యాశాఖాధికారుల ద్వారా వారి వారి అప్లికేషన్స్ ను సమర్పించాలని, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు వారి వారి అప్లికేషన్స్ ను సంబందిత ఉప విద్యాశాఖాధికారుల ద్వారా సమర్పించాలని తెలిపారు. కావున ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు వారి వారి అప్లికేషన్స్ ను నిర్ణీత గడువు ఈనెల 10 సాయంత్రం 5.00 లోపు ఆన్లైన్ నందు అప్లై చేసుకొని, హార్డ్ కాపీలు ప్రిన్సిపాల్, డైట్, మైనంపాడు, ప్రకాశం జిల్లా వారికి 10 వ తేదీ లోగా అందజేయాలన్నారు.

# ఘనముగా గ్రామ దేవతల ఉత్సవాలు

## భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు నైవేద్యాలు

## కార్యక్రమాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు





**చంద్రశేఖరపురం, పెన్ పవర్, ఏప్రిల్ 9**

చంద్రశేఖరపురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో గ్రామదేవతలు అంకాలమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల తిరునాళ్ల సందర్భంగా అమ్మవార్ల ఉత్సవాల కార్యక్రమాల్లో కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు మరియు కుటుంబ సభ్యులు పాల్గొని అంకాలమ్మ, పోలేరమ్మ అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించి గ్రామోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామదేవతల ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనముగా నిర్వహించారు. గ్రామ దేవతలను విద్యుత్ అలంకరణ మరియు ప్రత్యేక పూల అలంకరణలతో గ్రామంలో గ్రామోత్సవంను డప్పు వాయిద్యాలతో, భజంత్రీలతో పాటు బాణసంచా మధ్య నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామదేవతలకు వారు పోసి అడుగడుగునా కాయ కర్పూరంతో పూజలు నిర్వహించారు. గ్రామోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమంను నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ డప్పు వాయిద్యాలతో భజంత్రీల నడుమ గ్రామ దేవతలు అంకాలమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల ఆలయమునకు చేరుకొని అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజారి పూజలు నిర్వహించి అమ్మ వార్ల తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి ప్రకాష్ రావు, కదిరి పార్థసారథి, ఉప సర్పంచ్ తీకెనం బాబురావు, మాజీ ఎంపిటిసి మునగల వెంకటనారాయణ, కదిరి నరసింహ, ఇరగని చలపతిరావు, మాజీ ఎంపిటిసి ఎం కాశిరెడ్డి, శీలం మాధవరెడ్డి, కత్తులపల్లి నారాయణ, షేక్ నాయబ్ రసూల్, కొట్టే వెంకట కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు బ్రదర్స్ ఆధ్వర్యంలో అల్పాహార ప్రసాదం పంపిణీ



**చంద్రశేఖరపురం, పెన్ పవర్, ఏప్రిల్ 9**

చంద్రశేఖరపురం మండలంలోని శీలమువారిపల్లి గ్రామంలోని గ్రామదేవతలు అంకాలమ్మ, పోలేరమ్మ అమ్మ వార్ల పొంగళ్ళ సందర్భంగా పిడుగు బ్రదర్స్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక అల్పాహార ప్రసాదం ఏర్పాటు చేసి భక్తులకు పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో పిడుగు హరి నారాయణ, పిడుగు గోపయ్య, పిడుగు సత్యనారాయణ, ఏ. తిరుపతయ్య, కొట్టే కిరణ్, పిడుగు నారాయణ, సుంకరి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## పిల్లలలో పౌష్టిక ఆహార లోపాన్ని నివారించాలి

### యారవశ్రీనివాసులు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య.





**పామూరు, పెన్ పవర్,ఏప్రిల్ 9**

మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టిక ఆహార పక్షోత్సవాలు సందర్భంగా బుధవారం మండలం లోని బుక్కాపురం అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి సూపర్వైజర్ గోళ్ల పద్మజ ఆధ్వర్యంలో పౌష్టిక ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినారు .ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య లు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలకు చిన్నారులకు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించినారు. ఆకుకూరలు చిరుధాన్యాలు వంటివి క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే పాలు, గుడ్లు, చిక్కీలు గర్భిణి స్త్రీలు క్రమం తప్పకుండా పౌష్టిక ఆహారం తీసుకోవాలని అన్నారు. పిల్లలలో ఉబకాయ నీ తగ్గించడానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, టిడిపి నాయకులు షేక్ సుభాని, సయ్యద్ అమీర్ బాబు, దయుండే శంకర్, అంగన్వాడి కార్యకర్తలు నారాయణమ్మ ,అమల, సుభాషిని ,భాగ్యమ్మ, బాలింతలు, గర్భవతులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ద్రోణాదుల గ్రామ చరిత్ర' గ్రంథం ఆవిష్కరణ

### - రచయిత పెంటేల రాజాకు చిరుసత్కారం





**రిపోర్టర్ మార్టూరు, పెన్ పవర్ ఏప్రిల్ 09**

మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామంలో ప్రముఖ రచయిత పెంటేల రాజా రాసిన గ్రంథం 'ద్రోణాదుల గ్రామ చరిత్ర' గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ద్రోణాదులలోని గోపు లక్ష్మీనారాయణ, తులశమ్మ కళ్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు అతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతో సంబంధం లేకుండా తనకున్న మేథోశక్తితో గ్రంథ రచన చేయడం పెంటేల రాజా ఎంతోమందికి స్ఫూర్తి దాయకం అన్నారు. 3వేల సంవత్సరాల ద్రోణాదుల గ్రామ చరిత్రను 200 పేజీల్లో కూర్చిన విధానం అద్భుతమని ప్రశంసించారు. అలాగే కొండమీద రాక్షస గుండ్లు అనే 2600 ఏళ్ల నాటి సమాధులు వెలికి తీశారన్నారు. చోళులు, చాణిక్యుడు, కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగర చక్రవర్తులు, గజపతిరాజుల పాలన ద్రోణాదుల ముందుకు సాగిందని శాసన పరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి చెప్పారు. గ్రామంలోని మారెమ్మ, అక్కలాదేవి, చెన్నకేశవ ఆలయాలను వెయ్యి సంవత్సరాల క్రితమే నిర్మించినట్లు రాజా రచన ద్వారా తెలుస్తోందని విశ్రాంత ఆర్జేడీ ఉబ్బా దేవపాలన తెలిపారు. కనుమరుగవుతున్న చరిత్ర నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పంగులూరు మండల పరిషత్ పూర్వ అధ్యక్షుడు నాగబోయిన రంగారావు పిలుపునిచ్చారు. అనంతరం రచయిత రాజా రాసిన గ్రంథ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాజాను ప్రత్యేకంగా అభినందించారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం అమర రాజమోహన్ రావు, పెంటేల జగన్మోహన్ రావు, ఏపీ హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి షేక్. దరియావలి, పల్నాడు జిల్లా అధ్యక్షుడు బీపీవీ సుబ్బయ్య, బాపట్ల జిల్లా ప్రధానకార్యదర్శి కాకి రాజశేఖర్, రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్, ఇంకొల్లు ట్రెజరర్ నల్లమోతు రాధాకృష్ణ పాల్గొన్నారు.

## రీ సర్వే పై రైతులకు అవగాహన కల్పించుటకు గ్రామసభ

### గ్రామ సభలో పాల్గొన్న బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు



**చంద్రశేఖరపురం, పెన్ పవర్, ఏప్రిల్ 9**

చంద్రశేఖరపురం మండలం నలజనంపాడు రెవెన్యూ గ్రామం రీ సర్వే జరుతుందని, రైతుల సమస్యలపై అవగాహన కొరకు ముందుగా గ్రామసభ నిర్వహించామని మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభకు ఆర్డీవో, మండల తాసిల్దార్ ,మండల సర్వేయర్ పాల్గొంటారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే లో అనేక తప్పులు జరిగి రైతులు చాలా ఇబ్బందులు పడుతు న్నారని, గత ప్రభుత్వ తప్పులు పరిష్కారం కోసం ప్రభుత్వానికి రైతులు సుమారు 9లక్షల అర్జీలు దరఖాస్తు చేసుకున్నారని , మన ప్రభుత్వంలో ఎలాంటి తప్పులు జరగకుండ ముందుగా ఒక ప్రణాళిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రైతుల సమస్యలు పరిష్కారం కొరకు గ్రామాలలో గ్రామసభ నిర్వహిస్తున్నారని తెలిపారు . రహదారులను,వాగులను,ప్రభుత్వ భూములను గుర్తించి సబ్ డివిజన్, సర్వేచేసి మార్కింగ్ ఇచ్చి, రైతువారి విస్తీర్ణాలుకు,సబ్ డివిజన్ స్టేట్ మెంట్లు తయారు చేసి,కొలతలు మార్క్ చేసేటప్పుడు చెట్లు అడ్డు ఉంటే కొలతలలో తేడాలు వస్తాయని, కొలతలు తేడా రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యగా అడ్డు వచ్చిన చెట్లను తొలగించి,సర్వేచేసే భూమికి సంబంధించిన ప్రతి రైతుకూ కనీసం 2రోజులు ముందు నోటీసు ద్వారా తెలియపరచాలని,అతి ముఖ్యంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారులు, వాగులు, బంజరభూములు,గ్రామాఖంటాలు,బండ్లబాటలు,కాళి భాటలు,సబ్ డివిజన్ మార్కింగ్ చేసిన తర్వాత మాత్రమే సర్వే చెయ్యాలని,సర్వే నెంబర్లో ఉన్న ప్రతి రైతు విస్తీర్ణానానికి ఒకే ఎల్ పి యం కేటాఇంచారని తెలిపారు ఈ సందర్భంగా మాజీ విఆర్ఓ రామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రతి రైతు ఒక ఎన్పిఎం ను కేటాయించకుంటే క్రయ విక్రయాలకు రైతులు ఇబ్బందులకు గురి అగుచున్నారని,ప్రతి రైతుకూ ఒక ఎల్పిఎం కేటాయించక ఏదో చేసామంటే చేసాము అనే విధంగా చేయవద్దని అధికారులకు తెలియజేయాలని వెంకటేశ్వర్లు కు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నాగమణి ఎల్లయ్య ,మాజీ సర్పంచ్ డి. మాలకొండయ్య, టి. సుబ్బారాయుడు,సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బి. వెంకటాద్రి, కె వెంకటకొండయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, డి. నాగ సుబ్బారావు,గ్రామం లోని రైతులు పాల్గొన్నారు.

## బిజెపి క్రియాశీలక సభ్యుల సమావేశం



**పామూరు, పెన్ పవర్, ఏప్రిల్9.**

బిజెపి స్థానిక కార్యాలయంలో కనిగిరి నియోజకవర్గం బిజెపి కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య అధ్యక్షతన క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొండిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల్లో బిజెపి విజయం మరియు సంస్థగత విస్తరణ, భారత రాజకీయాల్లో బిజెపి తెచ్చిన మార్పు, గడిచిన11 సంవత్సరాల్లో వికసిత భారత్ దిశగా భారత ప్రధానిగా నరేంద్ర మోడీ ప్రయాణం, అనే అంశముపై మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో భారతదేశం శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్ది, అనేక ప్రతిష్టాకరమైనటువంటి బిల్లులను ప్రవేశపెట్టి చట్టపరంగా, న్యాయపరంగా సమర్థవంతంగా తెచ్చిన ఘనత నరేంద్ర మోడీ కే దక్కిందని వారి నాయకత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారతదేశం, మరియు మన రాష్ట్రం అనేక అంశాల మీద అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి నిధులు సమకూర్చి ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నరేంద్ర మోడీ కి కృతజ్ఞతలు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జాజం చిన్న సుబ్బయ్య, మండల అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీను, గోపాల్,సురేష్, చరణ్, కొప్పురపు వెంకట సుబ్బారావు, బొంతల హజరత్ కుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టణంలోని పలు స్మశాన వాటికలను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 9**

క్రైస్తవ సమాజానికి ప్రధానమైన పండుగ అయిన ఈస్టర్ పండుగ సందర్భంగా మాజీ మంత్రివర్యులు శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు చిలకలూరిపేట పట్టణంలోని స్మశాన వాటిక, ఆది ఆంధ్ర కాలనీ స్మశాన వాటిక, రాగన్నపాలెం స్మశాన వాటిక, చీరాల రోడ్డు స్మశాన వాటికలను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని , సందర్శించారు . ఈ సందర్భంగా ఆయన స్మశాన వాటిక లోని బోరు పంపులు రిపేర్ చేయుటకు మరియు స్మశాన వాటిక జంగిల్ క్లియర్ చేయుటకు సానిటరీ ఇన్స్పెక్టర్ రమణారావు, సునీత, ఏ ఈ ఆన్సర్, మరియు సంబంధిత అధికారులను ఆదేశం ఇవ్వడం జరిగింది. వీరితోపాటు టిడిపి టౌన్ జనరల్ సెక్రెటరీ మద్దు మాల రవి, కొండ వీరయ్య, గట్టుపల్లి మాణిక్యరావు, మచ్చ వెంకటేశ్వర్లు, కొండేపాటి రమేష్, మూకిరి వీరాంజనేయులు,పలువురు పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 9:**

బాపట్ల పట్టణంలోని శాసనసభ్యుల వారి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించిన బాపట్ల నియోజకవర్గం శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు . ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను స్వయంగా విని వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు బాపట్ల నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తామన్నారు. బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని సూచించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు . బాపట్ల నియోజకవర్గ ప్రజల నుండి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు.రానున్న రోజుల్లో బాపట్ల నియోజకవర్గంలోని అన్నీ గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తామని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు.

## ఈనెల 11న డివిజనల్ స్థాయి టాలెంట్ టెస్ట్

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 9**

అంబేద్కర్ కల్చరల్ అసోసియేషన్ నేకునాంపురం వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బడేవారిపాలెం స్పెషల్ పూర్వవిద్యార్థుల సహకారంతో నిర్వహించే డివిజనల్ స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం వలేటి మాలకొండ తెలిపారు. ఈనెల 11న మధ్యాహ్నం 2 గంటలకు జరుగును అని తెలిపారు. ఈ పరీక్షకు ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న, వివిధ గురుకుల పాఠశాలలలో 5 వ తరగతి ప్రవేశానికి పరీక్షలు రాసే విద్యార్థులకు ఓఎంఆర్ షీట్ పై పరీక్షలు రాసే విధానం అవగాహన కల్పించేందుకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. 13న జరుగు డాక్టర్ అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పరీక్షకు, 25 న జరుగు ఏపీ గురుకుల పరీక్షకు, 27న జరుగు మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పరీక్షకు హాజరుకాబోతున్న విద్యార్థులకు ఓఎంఆర్ షీట్ లో జరుగు ఈ టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది అని అన్నారు. కావున డివిజనల్ స్థాయి లో జరుగు ఈ పరీక్ష కు హాజరు కాబోవు వారు సెల్ :8179225614 , 9948889919, 9492126096 నంబర్స్ కు 10వ తేదీ సాయంత్రం 5గంటలలోపు తమ పేర్లు నమోదు చేసుకోగలరు.ఈ ఉచిత టాలెంట్ టెస్ట్ లో మంచి ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ మరియు కన్సోలేషన్స్ బహుమతులు కలవు అని మాల కొండయ్య తెలిపారు.

## వైయస్ జగన్ పై ఫేస్ బుక్ లో అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 9**

వైయస్ జగన్ పై ఫేస్‌బుక్‌లో అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై వైయస్ఆర్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాంటి వారిని వెంటనే అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రావణ్ మహారాజ్ అనే ఫేస్‌బుక్ అకౌంట్‌లో గత కొంతకాలంగా వైయస్ జగన్ మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలతో పోస్టులు పెడుతున్నట్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ అకౌంట్ ఎవరిదో గుర్తించి.. చర్యలు తీసుకోవాలని కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తోకల కొండయ్య, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య,షేక్ రఫీ, శంకర్, అయ్యన్న, రవీంద్ర, తదితరులున్నారు.

## ఆంధ్ర రాష్ట్ర శ్రీ షిరిడి సాయి ధర్మ పరిరక్షణ సేవా సొసైటీ గౌరవ అధ్యక్షులుగా మానుగుంట

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 9**

ఆంధ్ర రాష్ట్ర శ్రీ షిరిడి సాయి ధర్మ పరిరక్షణ సేవా సొసైటీ గౌరవ అధ్యక్షులుగా మాజీ మంత్రి మానుగుంట మహీధర రెడ్డి ఎన్నికయ్యారు.గౌరవ సలహా దారునిగా కనిగిరికి చెందిన మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి ఎన్నికయ్యారు. సంఘం యొక్క విధులు నిర్వహించుటకు తమ అంగీకారాన్ని తెలియజేసినందుకు రాష్ట్ర కమిటీ కార్యదర్శి గోపాలుని హరి హరరావు, సహాయ కార్యదర్శి దేవకి సుబ్రహ్మణ్యం, ప్రకాశం జిల్లా బాబా ఆలయాల అధ్యక్షులు అలహరి చంచల రావు, కందుకూరు నుండి శ్రీరామ్ మూర్తి , నరసింహారావు, కనిగిరి నుండి ముచ్చర్ల ధర్మారావు, వాగి చెర్ల వెంకటేశ్వర్లు మహీధర్ రెడ్డి ని, ముక్కు కాశి రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సాయి దాసు, ఉపాధ్యక్షులు కర్లపూడి కృష్ణ, సహాయ కార్యదర్శి ఆదిపూడి సాయిరాం , మైలవరం బాలాజీ రావు , శ్రీకాకుళం నాగ భూషణం, చిత్తూరు వరలక్ష్మి , వైజాగ్ సత్య కుమార్ అభినందనలు తెలియజేశారు. సాయి తత్వ ప్రచారామునకు, సేవా కార్యక్రమములకు, మా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని గౌరవ అధ్యక్షులు, గౌరవ సలహాదారులు తెలిపారు.





# శ్రీ సంస్కృతి స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుక









**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 9:**

అకాడమిక్, సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్న ప్రముఖ విద్యాసంస్థ అయిన శ్రీ సంస్కృతి స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహభరితంగా, శ్రద్ధతో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక వేడుకలో యూకేజీ, 5వ తరగతి విద్యార్థులు వారి విద్యా ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నారు. కార్యక్రమం పండుగ వాతావరణంలో అజ్ఞానాన్ని తొలగించే జ్ఞానదీపప్రజ్వలనంతో ప్రారంభమైంది. అనంతరం భక్తితో నిండిన ప్రార్థన గీతం ఆలపించబడింది.ప్రిన్సిపాల్ డి. శివకుమార్ సన్మానిత అతిథులు, తల్లిదండ్రులు విద్యార్థులకు స్వాగతం పలుకుతూ తన ఉద్బోధనాత్మక ప్రసంగం అందించారు. ప్రారంభ విద్యా దశలు ఒక విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది కడతాయని ఆయన ప్రస్తావిస్తూ, యూకేజీ, 5వ తరగతి విద్యార్థుల పురోగతిని కొనియాడారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం కోసం ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీ సంస్కృతి స్కూల్ ఛైర్మన్ కొంకా చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన కీలక ప్రసంగంలో చిన్నారులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారికి ఉన్నత శిఖరాలే లక్ష్యంగా నూతనోత్సాహంతో ధైర్యంగా ముందుకెళ్లాలని ప్రేరణనిచ్చారు. ఉపాధ్యాయుల త్యాగానికి, తల్లిదండ్రుల భాగస్వామ్యానికి ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు తెలిపారు. యూకేజీ, 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందజేయబడిన సందర్భం చాలా హర్షభరితంగా సాగింది. చిన్నారుల చిరునవ్వులు, ఆత్మవిశ్వాసం, మరియు ఆనందం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల చేతుల మీదుగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఈ వేడుకలో మరింత రంగులు నింపాయి. శాస్త్రీయ నృత్యాలు, గీతాలు, చిన్న నాటికలు విద్యార్థుల ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి.కార్యక్రమం కృతజ్ఞతాపూర్వక వాక్యాలు జాతీయ గీతంతో ముగిసింది. ఈ గ్రాడ్యుయేషన్ డే విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులందరిలోనూ గర్వభరితమైన మరియు భావోద్వేగంతో నిండిన ఓ మధురమైన జ్ఞాపకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి, అకడమిక్ కో ఆర్డినేటర్ ఆర్. శకుంతల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు విర్కో ఫౌండేషన్ వారి భారీ వితరణ



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 9:**



వెనకబడిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేస్తున్న విర్కో ఫౌండేషన్ చైర్మన్ నారాయణరెడ్డి టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 15 హెచ్ పి డెస్క్ టాప్ కంప్యూటర్లను డొనేట్ చేశారు. విద్యార్థుల అభివృద్ధి కొరకు వీటిని వాడాలని వారు సూచించారు. సమాజంలోని మూడు రంగాలలో ఆరోగ్యం, విద్య ,మౌలిక సదుపాయాల కల్పన విషయాలలో ప్రగతిని సాధించడానికి గాను ఈ సంస్థ ఆంధ్ర – తెలంగాణ రాష్ట్రాలలో కృషి చేస్తోంది. క్యాన్సర్ బారిన పడుతున్న తక్కువ ఆదాయ కుటుంబాల పిల్లలకు, వారి కుటుంబాలకు రవాణా సదుపాయము, ఆహారం, వసతి సౌకర్యాలతో కూడిన వైద్యాన్ని అందించే బృహత్తర ప్రాజెక్టును నిర్వహిస్తోంది. ఒక్క 2023 వ సంవత్సరంలోనే 287 మంది పిల్లలకు కీమోథెరపీ అందించడం జరిగింది. ఇక్కడ అన్ని రకాల క్యాన్సర్ పేషెంట్లకు మంచి వైద్యం అందిస్తున్నారు. ఇక్కడ ట్రీట్మెంట్ తీసుకున్న చాలా మంది పిల్లలు కోలుకొని చక్కగా పాఠశాలకు వెళ్లడం జరుగుతుంది .మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలో దీర్ఘకాలిక కిడ్నీ సమస్యలు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో, మహావీర్ హాస్పిటల్ వారి సహకారంతో జడ్చర్ల హైదరాబాద్ లోని ఏరియా హాస్పిటల్స్ లో డయాలసిస్ సెంటర్స్ ఏర్పాటు చేయడం, వంటి ఎన్నో సేవలను ఈ సంస్థ అందిస్తుంది. 2023వ సంవత్సరంలో 1566 డయాలసిస్ లు, ఈ సెంటర్స్ నందు నిర్వహించబడ్డాయి. వారి జీవితాల్ని నిలబెట్టడమే కాక ఆ పేషెంట్స్ కి కావలసిన అన్ని సదుపాయాలను వారు ఏర్పాటు చేస్తూ, పూర్తి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వివిధ రకాల అంగవైకల్యాలతో బాధపడుతున్న పిల్లలకు ఆర్టిఫిషియల్ లింబ్స్ పరికరాలు అందిస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన 697 మంది పిల్లలు ఈ సేవ ద్వారా లబ్ధి పొందారు. విర్కో ఫౌండేషన్ వారు అందిస్తున్న సేవలలో ఉన్నతమైన మరొక సేవ విద్యాపరమైన సేవ. పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు మంచి విద్యను అందించడానికి వివిధ రకాల సేవలను ప్రారంభించింది విర్కో ఫౌండేషన్. బాగా వెనుకబడిన ప్రాంతాల్లో, ప్రీస్కూల్, హై స్కూల్ భవనాలను నిర్మించడం ,శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించడం, పిల్లలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వీర్కో ఫౌండేషన్ అందిస్తున్న మరొక అద్భుతమైన కార్యక్రమం స్కాలర్షిప్ ప్రోగ్రాం. కాలేజీ విద్యార్థులకు, పదవ తరగతిలో మంచి గ్రేడ్ లో పాస్ అయిన పిల్లలకు స్కాలర్షిప్స్ అందిస్తూ వారిని ఉన్నత విద్యకు ప్రోత్సహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకి ఏడాదికి 15,000 రూపాయలు అందిస్తోంది. పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి కొన్ని పాఠశాలలో, కళాశాలలో సాంకేతిక పరికరాలను అందించి ల్యాబ్లను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగానే టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కూడా రూ. 9,15,000 విలువైన 15 డెస్క్ టాప్ కంప్యూటర్లు ఫౌండేషన్ అందించడం చాలా సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో విద్యార్థినీ విద్యార్థుల యొక్క నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ సహాయం చేసినట్లు ఆ ఫౌండేషన్ తెలియజేసింది. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ హార్దిక సాయం (వితరణ) అందించడంలో తోడ్పాటు అందించినవారు నారాయణ రెడ్డి మిత్రులు కొండేపి శ్రీరామ చంద్ర రావు. వారు గతంలో కళాశాలకు హార్దిక, ఆర్థిక సాయం అందించిన రిటైర్డ్ హెడ్మాస్టర్ ఇప్పగుంట మల్లికార్జున రావు శిష్యులు. ఈ సౌకర్యాలను కళాశాల విద్యార్థినీ విద్యార్థుల యొక్క నైపుణ్యాల మెరుగుదలకు మరింత సమర్థవంతంగా వినియోగించుకుంటామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ ఈ సందర్భంగా తెలియజేశారు.

## ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ కు ఘన నివాళులు



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 9**

భారతరత్న, రాజ్యాంగ రూపకర్త, దళితుల ఆశాజ్యోతి, లౌకిక ప్రజాస్వామ్య భారత నిర్మాత, విశ్వజ్ఞానజ్యోతి, కుల నిర్మూలన సామాజిక విప్లవాది, బోధిసత్వ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్134వ జయంతి సందర్భంగా కందుకూరు పట్టణ నడిబొడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఏప్రిల్ 1నుండి 13వ తారీకు వరకు జరుగుతున్న నివాళులు అర్పించు కార్యక్రమం ఏఏడి అసోసియేషన్, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ, దమ్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యం లో 4సంవత్సరాల నుండి జరుగుతున్నాయి.అందులో భాగంగా 9వ రోజు కందుకూరు ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉదయం 8:00 గంటలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షేక్ మహబూబ్ బాషా, రహీం, ఖాజా హుస్సేన్, ఉస్మాన్, ఎస్సదాని,మొగల్ బీగ్ హంగీర్, అలంకార్, బుడేషాహెబ్ తదితరులు పాల్గొని విశ్వజ్ఞాన సూర్యుడు అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఏ ఏ డి అసోసియేషన్ గౌరవధ్యక్షులు గేరా చిరంజీవి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు చనమాల కోటేశ్వరరావు , జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు ముప్పవరపు కిషోర్,దమ్మచక్ర ఫౌండేషన్ అధ్యక్షులు ఉపాసక గాండ్ల హరిప్రసాద్, సామాజిక ఉద్యమనేత రేనమాల అయ్యన్న, మేడబలిమి పుష్ప రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిషోర్

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 9**

గిద్దలూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మంచినీటి చలవేంద్రాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమలో పట్టణ తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

## చల్లపల్లి మండలంలో 59 అంగన్వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ కార్యక్రమం ప్రారంభం






**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్, 09:**

మొవ్వ ఐసిడిఎస్ పరిధిలోని చల్లపల్లి మండలం లో 59 అంగన్వాడీ కేంద్రాలలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పోషణ పక్వాడ కార్యక్రమం ప్రారంభం కాగా బుధవారం అన్ని అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈనెల 22వ తేదీ వరకు అన్ని అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుంది. మొదటి రోజు పోషక ఆహారం యొక్క ప్రాముఖ్యతను ఆయా అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీ బాలింత లతోపాటు సంరక్షకులతో కమ్యూనిటీ సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. అలాగే గర్భవతులు బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు పౌష్టికాహారము వ్యక్తిగత పరిశుభ్రత ఆరు సంవత్సరాల నిండిన పిల్లల బరువుల వివరాలను తెలిపారు చల్లపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆదిలక్ష్మి మహిళా పోలీస్ నాగలక్ష్మి ఆశ కార్యకర్త సీతారావమ్మ అంగన్వాడీ కార్యకర్తలు ముంతాజ్ బేగం లతో పాటు తదితరులు పాల్గొన్నారు ఐసిడిఎస్ లక్ష్మీపురం సెక్టర్ పరిధిలోనే 30 అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు ఆయా అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీ బాలింతలు సంరక్షణకులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ లక్ష్మీపురం సెక్టర్ సూపర్వైజర్ విశ్రాంతమ్మ మహిళా పోలీస్ ఆశ కార్యకర్తలు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆశీస్సులతో మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలి..!

### డిప్యూటీ సీఎం కుమారుని క్షేమాన్ని కాంక్షిస్తూ మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు..!



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్, 09:**

మోపిదేవి సుబ్బారాయుని ఆశీస్సులతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ ప్రమాద గాయాల నుంచి త్వరగా కోలుకోవాలని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం జనసేనాని తనయుని క్షేమాన్ని కాంక్షిస్తూ మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో మోపిదేవి శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో మార్క్ శంకర్ పేరిట గోత్రనామాలతో ప్రత్యేక పూజలు, స్వామివారికి విశేష అభిషేకాలు జరిపించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ సింగపూర్ దేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ చదువుకునే పాఠశాలలో అగ్ని ప్రమాదం సంభవించి శంకర్ గాయాలపాలైనట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ ప్రమాద గాయాల నుంచి క్షేమంగా కోలుకోవాలని, ఎలాంటి ఆపద కలుగకూడదని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, నాయకులు బాదర్ల లోలాక్షు నాయుడు, బడే సుబ్బారావు, కోసూరు శివాజీ, అరజా కిరణ్ కాంత్, కోసూరు రామాంజనేయులు, కామిశెట్టి శ్రీనివాసరావు, కోసూరు శివ నాగ మల్లేశ్వరరావు, మెరకనపల్లి నరేష్, కోసూరు నాగమల్లేశ్వర రావు, యడ్లపల్లి లక్ష్మణరావు, తోట కృష్ణాంజనేయులు, కోసూరు అన్వేష్ బాబు, కూరేటి రాఘవ, మత్తి వంశీ, ఆకుల పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

## అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 9 :**

చిలకలూరిపేట : అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో 30 మంది పారిశుధ్య కార్మికులకు 1,00,000/- విలువ కలిగిన నిత్యావసర సరుకులు మరియు వ్యక్తిగత రక్షణ కొరకు వస్తువులను ఉచితంగా ఇవ్వటం జరిగింది. పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా సరుకులు ఇవ్వటం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ రఫ్ఫాని, కమిషనర్, శ్రీహరిబాబు,అసిస్ట్ సంస్థ అధినేత జాష్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్ లు కృష్ణ హరీష్, విష్ణుప్రియ మరియు అసిస్ట్ సంస్థ సిబ్బంది పాల్గొనడం జరిగింది.



# అభివృద్ధి పనులు చేపట్టటం అభినందనీయం - కలెక్టర్ డీకే బాలాజీ..!







**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,మచిలీపట్నం, ఏప్రిల్, 09:**

ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మొవ్వ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు బుధవారం ఉదయం కృష్ణాజిల్లా మండల కేంద్రమైన మొవ్వ గ్రామం బస్టాండ్ సెంటర్లో 38 లక్షల రూపాయల గ్రామపంచాయతీ నిధులతో చేపట్టిన వ్యాపార దుకాణాల సముదాయము, డ్రైనేజీ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార రాజా తో కలిసి పాల్గొని పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి గ్రామపంచాయతీ చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలన్నారు. గ్రామంలో పారిశుద్ధం సరిగా లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో గ్రామ సర్పంచ్ చొరవ తీసుకుని పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడం ఎంతో అభినందించదగ్గ విషయం అన్నారు.పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ గ్రామ పంచాయతీలో కోటి రూపాయల వరకు నిధులను సమకూర్చి అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేయడం సంతోషదాయకమన్నారు.వర్షం పడితే గ్రామంలో నీరు నిలిచి ప్రజలంతా ఇబ్బంది పడే వారని, డ్రైనేజీ వ్యవస్థఏర్పాటుతో ఆ సమస్య తీరుతుందన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే కూచిపూడి నృత్య కళకు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో ఎంతో ప్రాశస్త్యం ఉన్న కూచిపూడి నాట్యకళకు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జన్మస్థలమైన బాట్ల పెనుమర్రుకు మహర్దశ రాబోతుందన్నారు. కూచిపూడి ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు వస్తున్నాయన్నారు. అది మనకెంతో గర్వకారణమన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొవ్వ మండలానికి జిల్లా కలెక్టర్ మూడుసార్లు రావడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్క రు తడి చెత్త పొడి చెత్త పై అవగాహన కలిగి మనతో పాటు భావితరాలకు ఆరోగ్యం పెంపొందించుకునేలా సహకరించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకునివస్తే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఇ రమణ రావు, ఈఈ సుధాకర్ గౌడ్,గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పిటిసి రాజులపాటి పార్వతి, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు వి పరిశుద్ధ రాజు, తహసిల్దారు మస్తాన్ రావు,ఎంపీడీవో విమాదేవి తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారముతో ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు.

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,మచిలీపట్నం, ఏప్రిల్, 09:**



జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారి అంగీకారంతో ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులు, ఆర్డీవోలతో సంయుక్త సమావేశం నిర్వహించి పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారం మేరకు అనువైన చోట ఆదర్శ ప్రాథమిక పాఠశాల (మోడల్ ప్రైమరీ స్కూల్ ః-ఎం పి ఎస్) ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి మండలానికి కనీసం 3 లేదా 4 ఆదర్శ పాఠశాలల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా గతంలో మాదిరి విద్యార్థుల తల్లిదండ్రులు అందరితో సమావేశం నిర్వహించకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి చదువుకుంటున్న విద్యార్థుల ఇంటింటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రాముఖ్యతను వివరించాలన్నారు. ఒక మంచి తరుణమని, 1,2 తరగతులు ఎలాంటి మార్పు జరగకుండా అదే ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతాయని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయులు ఉండటం వలన చక్కగా చదువుకుంటారని అవగాహన కలిగించాలన్నారు. మనం పని చేసే కాలంలో ఎలాంటి తప్పు జరగకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి మంచి జరిగేలా చొరవ చూపాలన్నారు. ఇదొక మంచి తరుణం అని, ఈరోజు మనం తీసుకునే నిర్ణయంపై విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ఇటీవల తాను ప్రభుత్వ పాఠశాలలు సందర్శించినప్పుడు 5వ తరగతి విద్యార్థుల ప్రతిభను పరీక్షించగా వారు లెక్కలు సరిగా చేయలేకపోతున్నారని, విద్యార్థులు చాలా వెనుకబడి పోతున్నారని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా నెగ్గుకొని రావాలంటే మార్పు చాలా అవసరం అన్నారు. అదే కనుక ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నపక్షంలో విద్యార్థులు బాగా విద్యను నేర్చుకుంటారన్న విషయం తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. మండలానికి మూడు లేదా నాలుగు మండల ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు ఇది చరిత్రలో నిలిచిపోయే ఒక ప్రక్రియ అని చెప్పారు. కృషిత్రస్థాయిలో పర్యటించేటప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించేటప్పుడు సచివాలయ సిబ్బందిని, మండల ప్రత్యేక అధికారులను, ఎంపీడీవోలతో సమన్వయం చేసుకొని అనుకున్న లక్ష్యాన్ని సజావుగా నెరవేర్చాలన్నారు.ఈ సమావేశంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, డి ఈ ఓ పివిసి రామారావు, కె ఆర్ సి కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, మచిలీపట్నం ఉయ్యూరు ఆర్ డి ఓ లు స్వాతి, బిఎస్ హేలా షారోన్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, మెప్మా పిడి సాయిబాబు ఉప విద్యాధికారులు, పలువురు మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై తక్షణమే నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలి..!

### కృష్ణాజిల్లా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ డిమాండ్.

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్, 09:**



భారత రాజ్యాంగం ప్రకారం ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న పోలీసులను బట్టలు ఊడదీసి తన పవర్ చూపిస్తానని బెదిరించిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై తక్షణమే నాన్ బైలబుల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కృష్ణా జిల్లా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ బుధవారం మచిలీపట్నంలో డిమాండ్ చేశారు.. కోట్ల రూపాయల కుంభకోణంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తిరుగుతున్న జగన్మోహన్ రెడ్డి బహిరంగంగా పోలీసులను హెచ్చరించడం విధి నిర్వహణలో ఉన్న పోలీసులను కించపరచడం అవమానపరచటం కింద వస్తుందని బాలాజీ అన్నారు. బాధ్యత గల శాసనసభ్యునిగా మాజీ ముఖ్యమంత్రిగా పోలీసులు గౌరవించవలసిన జగన్మోహన్ రెడ్డి వీధి రౌడీ గా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి రాష్ట్ర డి.జి.పి తక్షణమే స్పందించాలని బాలాజీ డిమాండ్ చేశారు. పోలీసు వ్యవస్థ ఒక్క నిమిషం కళ్ళు మూసుకుంటే సమాజం అల్లకల్లోలం అవుతుందని విషయం మీకు తెలియదా అని జగన్మోహన్ రెడ్డిని బాలాజీ ప్రశ్నించారు. అధికార పార్టీకి ప్రతిపక్ష పార్టీకి మరియు ఏ కార్యక్రమాలు జరిగినా కుటుంబ సభ్యులుని విడిచిపెట్టి ప్రాంతం కానీ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలకు తమ ప్రాణాలను అడ్డుపెడుతున్న పోలీసులను ఎవరూ కూడా ఎప్పుడు దూషించకూడదు ద్వేషించకూడదని అని బాలాజీ అన్నారు.. పోలీసు వ్యవస్థ 24 గంటలు సమాజానికి రక్షణ వ్యవస్థ అని బాలాజీ అన్నారు. పోలీస్ కానిస్టేబుల్ గా ఎన్నిక కావడానికి ఎన్నో అర్హతలు కావాలని అంచలంచలుగా ఎదుగుతున్న పోలీస్ ల వ్యవస్థను బట్టలూడదీసి నిలబెడతామన్న జగన్మోహన్ రెడ్డి మాటలు తన దిగజారుడుతనానికి నిదర్శనం అని బాలాజీ అన్నారు. తక్షణమే జగన్మోహన్ రెడ్డి పోలీసులకు బహిరంగంగా బేషరతుగా క్షమాపణ చెప్పాలని బాలాజీ డిమాండ్ చేశారు. కోడి కత్తి కేసు బాబాయ్ హత్య, మద్యం స్కాములు వంటి అనేక క్రిమినల్ కేసులో సంబంధం ఉన్న జగన్మోహన్ రెడ్డి పోలీసు వ్యవస్థను దూషించడం సరికాదు అన్నారు. తాను పరిపాలించిన ఐదు సంవత్సరాలు పోలీసులు లేకుండా బయటకు రాని జగన్మోహన్ రెడ్డి, ప్రస్తుతం పోలీసు సంరక్షణతోనే బయటికి వస్తున్న జగన్మోహన్ రెడ్డి, ఆ పోలీసులనే కించపరిచే విధంగా మాట్లాడటం సరైన విధానం కాదని బాలాజీ అన్నారు. పోలీస్ వ్యవస్థ పై నమ్మకం లేకపోతే జగన్మోహన్ రెడ్డి తనకు కేటాయించిన పోలీస్ ఎస్కార్ట్ ను బే షరతుగా ఉపసంహరించుకోవాలని బాలాజీ అన్నారు. జగన్మోహన్ రెడ్డి పై ఉన్న అన్ని కేసులు ఏ విధమైన అలసత్వం లేకుండా తక్షణమే విచారణ చేయాలని కూడా బాలాజీ డిమాండ్ చేశారు. అందుకు ఉభయ రాష్ట్రాలలోని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ తగిన చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు.

## గూడ పాడు ని సుందర గ్రామంలో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న అమర్నాథ్..!

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపటం, ఏప్రిల్, 09:**



కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు గ్రామాలను సుందర గ్రామాలుగా తీర్చిదిద్దాలని లక్ష్యముతో మొవ్వ మం డలం గూడ పాడు పం చాయతీ కార్యదర్శి కొప్పుల అమర్నాథ్ ముందుకు సాగుతున్నారు ఆయన ఒక ప్రక్కన తన ఉద్యోగ బాధ్యతలను సమర్థవం తంగా నిర్వహిస్తూ మరో ప్రక్కన గ్రామాల్లోనే ప్రజ లకు అందుబాటులో ఉం టూ వారిలో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తూ అందర్నీ ఆలోచింప చేస్తున్నారు గ్రామంలోని ప్రజలందరూ వారి వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించే విధముగా వారి ఇళ్లకు వెళ్లి స్వయంగా వారితో మాట్లాడి చైతన్య పరుస్తున్నారు. గతంలో చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ రోడ్ల పైన పడి ఉండేవి అలాంటివి అమర్నాథ్ చొరవతో ఎవరికివారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో రహదారులు అద్దముల మారాయి అంతేకాకుండా ఎవరు ఇళ్ల వద్ద చెత్త వారు స్వయంగా చెత్తకుండీలో పడేసే విధముగా వారిలో అవగాహన పెంపొందించారు పొడి చెత్త తడి చెత్తను వేరు చేసి గ్రామంలోని ప్రజలే అందించేలా చైతన్య పరిచారు గతంలో రహదారులు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా గుంటలతో అధ్వానముగా ఉండేవి అలాంటి రహదారులను ఇప్పుడు అభివృద్ధిపరిచి ఆ సమస్య లేకుండా చేయగలిగారు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడ అక్కడకు తడి పొడి చెత్తను గ్రామాల్లోని ప్రతి ఇంటి నుండి సేకరించి తరలించేలా చర్య తీసుకుంటున్నారు ఈ నేపథ్యంలో మంగళవారం కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో అధికారులతో కలిసి పర్యటించారు ఆయా గ్రామాలలో చేపడుతున్న పరిసరాల పరిశుభ్రతను పరిశీలించడంతోపాటు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించి ఆయన కార్యదర్శి అమర్నాథ్ను అభినందించారు అంతేకాకుండా గ్రామంలోనే ప్రజలను కలిసి పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు మరోసారి మీ గ్రామానికి వస్తానని తెలుపుతూ కార్యదర్శిని అభినందించారు

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తనయుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని జనసేన నాయకులు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 9:**

ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తనయుడు మార్క్ శంకర్‌కు సింగపూర్‌లోని గాయాలయ్యాయని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. సింగపూర్‌లోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మార్క్ శంకర్‌కు గాయాలయ్యాయని ప్రాథమిక సమాచారం. మార్క్ శంకర్ గాయాల నుంచి త్వరగా కోలుకోవాలని బాపట్ల జనసైనికులు బుధవారం శ్రీ సువచ్చల సమేత ప్రపత్యాంజనేయస్వామి ఆలయం వద్ద ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి, జనసేన నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులను చెల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుత్నూ మార్క్ శంకర్ ఆరోగ్యం బాగుండాలని తెలుగు రాష్ట్రాల్లో ఉన్న జనసైనికులు గుడిలో చర్చిలో మసీదుల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలని తెలుగు ప్రజలందరూ కోరుకుంటున్నారని తెలిపారు...ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల అధ్యక్షుడు గోట్టిపాటి శ్రీకృష్ణ, బాపట్ల నియోజకవర్గ జనసైనికులు కారుమూరి అంజనేష్,పసుపులేటి మహేష్, కామిశెట్టి సాయిబాబు, కోకి రాజశేఖర్ రెడ్డి, పదమటి ధర్మారావు, చిలకల సురేంద్ర, విష్ణుమొలకల చంద్రమోహన్, పదమటి ధర్మారావు, దండుప్రోలు కిషోర్,బుర్రీ కిషోర్, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పేరుకే పరామర్శ .. ప్రదర్శించినవన్నీ

# ఫ్యాక్షనిస్ట్ పోకడలే..

**పోలీసుల బట్టలు ఊడదీయిస్తానన్న జగన్ వ్యాఖ్యలు ఏపీ పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చ**

**తన తప్పు తెలుసుకొని జగన్ బేషరతు క్షమాపణ చెప్పేవరకు పోలీస్ వ్యవస్థ పోరాడాలి.**

**పోలీస్ అధికారుల సంఘం న్యాయస్థానాల్ని ఆశ్రయించైనా జగన్ కు శిక్షపడేలా చూడాలి : మాజీమంత్రి**

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 9 :**



చిలకలూరిపేట : చనిపోయిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించే పేరుతో జగన్ ఆడిన నాటకం, పోలీస్ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు ఆయనలోని ఆధిపత్య భావజాలానికి, అహంకారానికి నిదర్శనాలనే చెప్పాలి. కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన వ్యక్తి, కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, స్థానిక నాయకుల సమస్యలు విని వారిలో భరోసా నింపాలి. కానీ రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం పాపిరెడ్డిపల్లెలో జగన్ చేసిన వీరంగం యాక్షన్ సినిమా క్లైమాక్స్ ను తలదన్నిందనే చెప్పాలి. పేరుకే పరామర్శ తప్ప జగన్ ప్రదర్శించినవన్నీ ఫ్యాక్షనిస్ట్ పోకడలే. పోలీసుల బట్టలు ఊడదీయిస్తానన్న జగన్ వ్యాఖ్యలు, ప్రజాస్వామ్యంలో ప్రజల రక్షణబాధ్యతల్లో తలమునకలైన పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చగా నిలిచాయి. మహిళా పోలీస్ అధికారులు ఆ జిల్లాలో విధి నిర్వహణలో ఉన్నారని తెలిసీ జగన్ అలా వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. పోలీసులు సరిగా పనిచేయకపోతే జగన్ రాప్తాడులో స్వేచ్ఛగా పర్యటించి, యధేచ్ఛగా నోరు పారేసుకోగలిగేవాడా? తన పర్యటనలో భాగంగా హెలిప్యాడ్ వద్ద, పాపిరెడ్డి పల్లె చుట్టూ రక్షణగా నిలిచిన వందలమంది పోలీసులు జగన్ కు కనిపించలేదా? పోలీస్ వ్యవస్థ జగన్ తీరుని ఏమాత్రం ఉపేక్షించకూడదు. తమపై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా జగన్ క్షమాపణ చెప్పేవరకు రాష్ట్ర పోలీస్ వ్యవస్థ పోరాడాలి. ఆయన తన తప్పు తెలుసుకునేలా చేసి, పోలీసుల పవర్ ఏంటో తెలియచేయాలి. అప్పుడే మరోసారి వైసీపీ అధినేత ఒళ్లుతెలియకుండా వ్యవహరించడు. వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు పోలీసుల్ని డ్యూటీ సక్రమంగా చేయమంటే, తమను ఏదో అన్నారని గొంతుచించుకున్న పోలీస్ అధికారుల సంఘం తక్షణమే జగన్ వ్యాఖ్యలపై న్యాయస్థానాల్ని ఆశ్రయించాలి. ఖాకీలను తూలనాడినితే తలెత్తే పర్యవసానాలు, పరిణామాలు తెలిసొచ్చేలా కఠిన శిక్ష పడేలా చూడాలి. సాటి మహిళా పోలీస్ సిబ్బందిని దూషించిన వ్యక్తికి ఇప్పుడు బుద్ధిచెప్పకపోతే, అతన్ని ఆదర్శంగా తీసుకొని మునుముందు వైసీపీ శ్రేణులు రెట్టింపు మదంతో రెచ్చిపోతారనే వాస్తవాన్ని పోలీస్ ఉన్నతాధికారులు గ్రహించాలి. అని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు.

పెన్ పవర్

గుంటూరు । బాపట్ల । పల్నాడు

## శ్రీ విజయ అకాడమీలో వి.వి నాంచారయ్య ఇంగ్లీష్ ల్యాబ్ ప్రారంభం

**స్టాఫ్, రిపోర్టర్, పెన పవర్, మచిలీపట్నం, ఏప్రిల్, 09:**

చల్లపల్లి: ఆంగ్లభాషపై పట్టు సాధించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మాజీ ఎంపీపీ యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్( లంక బాబు) కోరారు. స్థానిక శ్రీ విజయ అకాడమీలో ఏర్పాటు చేసిన వి.వి నాంచారయ్య ఇంగ్లీష్ ల్యాబ్ ను లంక బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నాంచారయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు కీర్తిశేషులు వేములపల్లి వెంకట నాంచారయ్య జ్ఞాపకార్థం ఈ ల్యాబ్ ప్రారంభించడం అత్యంత ముదావహం అన్నారు. విద్యార్థులు ఇంగ్లీషు ల్యాబ్ ను వినియోగించుకుని ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కీర్తిశేషులు వివి నాంచారయ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాఠశాల స్థాయిలో అరుదుగా ఉండే ఇంగ్లీష్ ల్యాబ్ ను శ్రీ విజయ అకాడమీలో ఉన్నత ప్రమాణాలతో నూతన టెక్నాలజీ ఉపయోగించి వి.వి నాంచారయ్య ఇంగ్లీష్ ల్యాబ్ ప్రారంభించడం ఎంతో ఆనందదాయకంగా ఉందని కరస్పాండెంట్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ



అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం కంఠంనేని కుటుంబరావు గద్దే రఘురామారావు, ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు, ఇంగ్లీష్ ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## శక్తి యాప్ ఆవశ్యకత గురించి మహిళలకు, విద్యార్థినిలకు విస్తృత అవగాహన కల్పిస్తున్న జిల్లా శక్తి బృందాలు

**మహిళలకు అండగా శక్తి యాప్ -మొబైల్లో శక్తి యాప్ ఉంటే రక్షణగా పోలీస్ మీ వెంట ఉన్నట్లే**

**భద్రతతో కూడిన ప్రయాణానికి భరోసాగా సేఫ్ మై ట్రావెల్ సదుపాయం -జిల్లా ఎస్పీ తుషార్ డూడి**







**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 9:**

భద్రతతో కూడిన ప్రయాణానికి భరోసాగా శక్తి యాప్ లోని సేఫ్ మై ట్రావెల్" సదుపాయం వినియోగించుకొవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో బుధవారం జిల్లాలోని శక్తి బృందాలు వారి పరిధిలోని కళాశాలలో పాఠశాలలో ప్రభుత్వ కార్యాలయాలలో రైల్వేస్టేషన్ లలో బస్టాండ్ లలో ప్రధాన కూడళ్లలో ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో మహిళలకు విద్యార్థినిలకు శక్తి యాప్ ఆవశ్యకతను గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తూ యాప్ ను ఏవిధంగా మొబైల్ ఫోన్ లలో డౌన్లోడ్ చేసుకొని ఇన్స్టాల్ చేసుకోవాలో వివరిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలకు విద్యార్థినులకు అత్యవసర సమయాలలో శక్తి యాప్ అండగా ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్ లో శక్తి యాప్ ఉంటే రక్షణగా పోలీసులు మీ వెంటే వున్నట్లేనని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ఆపదలో చిక్కుకున్న మహిళలు, విద్యార్థినిలు యాప్ లోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం వెళుతుందన్నారు. వారు వేగవంతంగా ఘటన స్థలానికి చేరుకొని మహిళలకు రక్షణ కల్పిస్తారని తెలిపారు. దీనిలో హ్యాండ్ షేక్అనే సదుపాయం ఉంటుందన్నారు. ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేసే పరిస్థితులలో లేనప్పుడు మొబైల్ ఫోన్ ను గట్టిగ షేక్ చేస్తే వెంటనే కంట్రోల్ రూమ్ కు సమాచారం అందుతుందన్నారు. తద్వారా నిమిషాల వ్యవధిలోనే పోలీసులు బాధితుల వద్దకు చేరుకొని వారికి భద్రత కల్పిస్తారన్నారు. యాప్ లోని సేఫ్ ట్రావెల్ అనే సదుపాయం ఉంటుందన్నారు. మహిళలు విద్యార్థినులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఆటోలలో, క్యాబ్ లేదా ఇతర వాహనాల్లో ఒంటరిగా ప్రయాణించే సందర్భంలో సేఫ్ ట్రావెల్ సదుపాయాన్ని ఎంపిక చేసుకొని బయలుదేరే ప్రాంతం చేరుకోవాల్సిన గమ్యస్థానం ప్రయాణంచేసే వాహనం నెంబర్ తదితర వివరాలు అందులో నమోదు చేయాలన్నారు. వాహనం వెళ్లే మార్గం కంట్రోల్ రూమ్ నుండి పరివేక్షించబడుతుందన్నారు. వాహనం నిర్దేశిత మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్తుంటే కంట్రోల్ రూమ్ కు మెసేజ్ వెళుతుందన్నారు. వెంటనే స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి ఘటన స్థలానికి పంపడం జరుగుతుందన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధిత మహిళకు రక్షణ కల్పించి తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు. మహిళలు ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ లకు వెళ్ళవలసిన అవసరం లేకుండా యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. గివ్ ఏ కంప్లైంట్ అనే సదుపాయం ఎంచుకొని జిల్లా, పోలీస్ స్టేషన్ ఎంపిక చేసుకొని ఏ అంశంపై ఫిర్యాదు చేస్తున్నారో పేర్కొనాలన్నారు. కాగితంపై రాసిన లేదా టైప్ చేసిన ఫిర్యాదును అప్లోడ్ చేయాలన్నారు. ఆ ఫిర్యాదును పరిశీలించి పోలీసులు మిమ్మల్ని సంప్రదిస్తారని తెలిపారు. మహిళలు ఏదైనా తెలియని ప్రదేశానికి లేదా కొత్త ప్రదేశానికి వెళ్ళినట్లయితే యాప్ వినియోగించుకొని అక్కడ దగ్గరలో ఉన్న నైట్ షెల్టర్లు సురక్షితమైనప్రదేశాల గురించి సమాచారం తెలుసుకోవచ్చునన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్ ల వివరాలు అక్కడి పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్లు, అత్యవసర నెంబర్లు ఈ యాప్ లో పొందుపరచబడి ఉన్నాయన్నారు. జిల్లాలోని మహిళలు విద్యార్థినిలు తమ మొబైల్ ఫోన్ లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

## ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే





**చీరాల, పెన్ పవర్, ఏప్రిల్ 09**

చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య క్యాంపు కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు ఏఎంసీ ఛైర్మన్ కౌతరపు జనార్ధన్, మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, వేటపాలెం మండల మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి, జనసేన నాయకులు పద్మిని, బీజేపీ నాయకులు చంద్ర, తదితరులు ప్రజల నుంచి సుమారు 150 అర్జీలు స్వీకరించారు.

## మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడు తున్నాయని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 9:**







బుధవారం స్థానిక సాయిరామ్ గార్డెన్ కన్వెన్షన్ హాల్ లో జిల్లా స్థాయి పోషన్ పక్వాడ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శిశు సంక్షేమం కోసం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఈనెల 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహించ డానికి చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. గర్భిణీ స్త్రీలు ప్రసవాలు అయిన నాటినుండి పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి, ఎలాంటి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. మహిళలు గర్భం దాల్చిన తర్వాత వారి ఆరోగ్య పరిస్థితులు బీపీ షుగర్లు మరియు రక్తహీనతకు సంబంధించిన వ్యాధులను గుర్తించి వారికి అవసరమైన మందులు ఇవ్వాలని ఆయన అధికారులకు చెప్పారు. శిశువు పుట్టిన మొదటి 360 రోజులు వారి శారీరక దృఢత్వం కోసం అవసరమైన పౌష్టికాహారం అందించాలని ఆయన చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆరోగ్యకరమైన, బలవంతమైన ఆహారాన్ని అందించ డానికి చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. అనాధ శిశువుల కోసం రైల్వే స్టేషన్లో బస్టాండ్ లో ఊయలలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. జిల్లాలో సఖి వన్ స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న బాపట్ల శాసనసభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. మహిళాశిశు సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. మహిళ సంక్షేమ శాఖ సంరక్షణలో ఉన్న పిల్లలను తమ సొంత పిల్లలు వలే ప్రేమాను రాగాలతో చూడాలని ఆయన చెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సీమంత చేసుకున్న 20మంది మహిళలకు వేగేశన ఫౌండేషన్ ద్వారా5వేల రూపాయల వంతున లక్ష రూపాయలు నిధులను ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ మరియుశాసనసభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా 20 మంది గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖఎస్.ఇ అనంతరాజు, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గ గుడి భూముల లీజు పొడిగింపు వివాదం

**విజయవాడ, ఏప్రిల్ 9, పెన్ పవర్:** విజయవాడలో దుర్గ గుడి భూముల లీజు వ్యవహారంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. నగరంలో ప్రధాన ప్రాంతంలో ఉన్న దాదాపు ఆరు ఎకరాల భూమి లీజు గడువు ముగియడంతో దానిని మరోమారు పొడిగించాలని లీజుదారుల నుంచి దేవాదాయ శాఖకు ప్రతిపాదనలు అందాయి. అందులో విద్యా సంస్థను నిర్వహిస్తుండటంతో మరో 50ఏళ్లకు పొడిగించాలని లీజుదారులు అభ్యర్థించారు. యాభై ఏళ్లుగా నామమాత్రపు ధరతో ఉన్న దుర్గగుడి భూముల లీజును మరోసారి పొడిగించే ప్రతిపాదనకు దేవాదాయ శాఖ అభ్యంతం తెలిపింది. యాభై ఏళ్ల తర్వాత ఏమి జరుగుతుందో తెలియనందున ఆలయ భూముల్ని సమగ్రంగా సర్వే చేసి వాటిని శాశ్వతంగగా డిజిటల్ రూపంలో భద్రపరిచిన తర్వాత లీజు ప్రక్రియపై ముందుకు వెళ్లాలని ఆ శాఖ కార్యదర్శి కమిషనర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో దుర్గామల్లేశ్వర దేవస్థానం నుంచి పటమట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలో 5.90ఎకరాల భూమిని లీజుకు తీసుకున్న సిద్ధార్థ అకాడమీ పేరిట లీజు పొడిగించాలని కొందరు అధికారులు, దేవాదాయ శాఖ అధికారులకు మౌఖికంగా సూచించారు. దీంతో లీజు ప్రతిపాదనల్ని దేవాదాయ శాఖ ఎస్టేట్స్, లీగల్ విభాగం క్షణ్ణంగా అధ్యయనం చేసి చట్ట ప్రకారం సాధ్యం కాదని తేల్చేశారు. యాబై ఏళ్లకు లీజును పొడిగిస్తే అప్పటికి 100ఏళ్లు పూర్తై యాజమాన్య హక్కుల్ని దేవస్థానం కోల్పోతుందని, భూమికి శాశ్వత యజమానులుగా లీజుదారులు అవుతారని అభ్యంతరం అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో లీజు గడువును తగ్గించి పొడిగించాలనే సూచనలు అందాయి. ఇప్పటికే 50ఏళ్లుగా లీజు కొనసాగుతుండటంతో లీజు పొడిగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కొత్తగా మరోసారి లీజుకు తీసుకోవాల్సిందేనని కొత్త చట్టం ప్రకారమే లీజులు పొందాలని వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో దుర్గగుడి భూముల లీజు వ్యవహారాన్ని కొలిక్కి తెచ్చే బాధ్యత ఇంఛార్జి హోదాలో ఉన్న ఉన్నతాధికారి భుజాలకు ఎత్తుకున్నారు. పెద్దసార్ ఆదేశించారంటూ అధికారులపై ఒత్తిడి చేయడంతో లిఖిత పూర్వకంగా వివరణలు, ప్రతిపాదనలు ఇస్తే తప్ప తాము ముందుకు వెళ్లలేమని ఆ శాఖ అధికారులు తేల్చేశారు. దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం అవుతుండటంతో దేవాదాయ శాఖ చట్టానికి కొన్నేళ్ల క్రితం మార్పులు చేశారు. పాత చట్టంలో లీజుల పొడిగింపుకు అవకాశం ఉన్నా కొత్త చట్టంలో లీజు పొడిగింపు క్లాజ్ లేదని దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే 50ఏళ్లుగా లీజులో ఉన్న భూముల్ని మరోసారి పొడిగించడం ప్రస్తుత చట్టం ప్రకారం సాధ్యం కాదని, అలా చేయాలంటే క్యాబినెట్ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు. దేవాదాయ శాఖ భూమి లీజు వ్యవహారంపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తులో తలెత్తే న్యాయవివాదాలకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని భయపడుతున్నారు. ఈ క్రమంలో భూముల లీజు పొడిగించాలని ఒత్తిడి చేస్తోన్న అధికారినే ఏ నిబంధన ప్రకారం భూముల లీజు పొడిగించాలో ప్రతిపాదనలు పంపాలని దేవాదాయ శాఖ అధికారులు సూచించారు. వ్యవసాయేతర భూమిగా వినియోగంలో ఉన్న భూమి విలువను ఎలా నిర్ణయిస్తారో కూడా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు లక్షన్నర లీజుగా చెల్లిస్తుండగా 10శాతం పెంపుదలతో లక్షా 65వేలుగా లీజు ధరను ప్రతిపాదించడంపై కూడా దేవాదాయశాఖ అభ్యంతరం చెబుతోంది. చట్టంలో లీజు పొడిగింపు అవకాశం లేనపుడు బహిరంగంగా జరిగే ప్రక్రియలోనే భూమి ధరను ఖరారు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందులో విద్యా సంస్థలు కొనసాగుతుండటంతో బహిరంగ వేలాన్ని మినహాయించినా అద్దె ధరను మాత్రం మార్కెట్ ధరలకు అనుగుణంగా ఖరారు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. దేవాదాయ శాఖలో ఇన్‌ఛార్జి హోదాలో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి లీజు వ్యవహారంలో లిఖిత పూర్వకంగా ప్రతిపాదనలు చేయకుండా ముందుకు వెళ్లలేమని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. మౌఖిక ఆదేశాలను పాటిస్తే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు తాము బాధ్యత వహించాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో గతంలో కానూరు గ్రామ పంచాయితీ పరిధిలో సర్వే నంబర్ 282లో ఉన్న 12.39 ఎకరాల భూమిని యాభై ఏళ్లకు లీజుకు ఇవ్వాలని సిద్ధార్థ అకాడమీ 1997 నవంబర్ 25న కోరగా అప్పట్లో దేవాదాయ శాఖ లేవనెత్తిన అభ్యంతరాలను గుర్తు చేస్తున్నారు. దుర్గ గుడి భూముల లీజు వ్యవహారంలో మార్కెట్ ధరలకు అనుగుణంగా లేకపోతే నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. 1975-76 భూమిని లీజుకు ఇచ్చినపుడు మొదటి ఆరేళ్లు రూ.6వేల రుపాయలకు లీజుకు ఇచ్చారని తర్వాతి పదేళ్లకు రూ.7వేలు, తర్వాత పదేళ్లు 8వేలు, ఆ తర్వాత పదేళ్లు 9వేలు, ఆ తర్వాత పదేళ్లు 10వేలు, ఆ తర్వాత ఏడాదికి రూ.11వేల అద్దె చెల్లించేలా యాభై ఏళ్లకు లీజుకు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం సిద్ధార్థ అకాడమీ పేరిట విజయవాడ మొగల్రాజపురంలోని సర్వే నంబర్ 76లో 8.22 ఎకరాలు, పటమట సర్వే నంబర్ 17లో 5.98ఎకరాల భూమి సిద్ధార్థ అకాడమీ పేరిట లీజుకు ఉంది. 2012 నాటికి ఈ భూముల విలువ రూ.176.34కోట్లుగా నిర్ధారించారు. పటమటలో ఉన్న భూమికి గజం రూ.30వేల చొప్పున రూ.86.83కోట్లు, మొగల్రాజపురంలో ఉన్న భూమికి గజం రూ.22,500 చొప్పున రూ.89.51కోట్లుగా ఉంది. ప్రస్తుతం ఈ విలువలు భారీగా పెరిగాయని దేవాదాయ శాఖకు వచ్చే ఆదాయం ఆ స్థాయిలో లేదని దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

# సజ్జల స్థానంలో సతీష్ రెడ్డి



**కడప, ఏప్రిల్ 9, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ లో జగన్మోహన్ రెడ్డి విధేయత కలిగిన నేతలు చాలామంది ఉన్నారు. ఆయన చుట్టూ పార్టీకి స్తంభాల వ్యవహరించే నాయకులు ఉన్నారు. అయితే వారిపై 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. విమర్శలు వ్యక్తమయ్యాయి. వారి పేరు చెప్పి చాలామంది నేతలు పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఆ కీలక నాయకుల్లో ఒకరైన విజయసాయిరెడ్డి సైతం పార్టీ నుంచి బయటికి వెళ్లిపోయారు. జగన్మోహన్ రెడ్డి పార్టీ ఏర్పాటు చేయక ముందు నుంచే ఆయనకు సన్నిహితుడు విజయసాయిరెడ్డి. వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి ఆడిటర్ గా ఉన్న విజయసాయి కాలక్రమంలో జగన్మోహన్ రెడ్డికి అత్యంత నమ్మిన బంటుగా మారిపోయారు. అటువంటి వ్యక్తి పార్టీ నుంచి బయటకు వెళ్లే క్రమంలో అనేక రకాల ఆరోపణలు చేశారు. కోటరీని మార్చుకోకుంటే మాత్రం జగన్మోహన్ రెడ్డికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. పరోక్షంగా వైవి సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి ల పై సంచలన ఆరోపణలు చేశారు విజయసాయిరెడ్డి. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి పార్టీలో కీలక నియామకాలు చేపడుతున్నారు. అందులో భాగంగా సజ్జల రామకృష్ణారెడ్డి బాధ్యతల నుంచి తొలగిస్తుండడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత సజ్జల చుట్టూ వివాదాలు నడిచాయి. చాలామంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లు సజ్జలపై ఆరోపణలు చేశారు. ఆయన తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. అయినా సరే జగన్మోహన్ రెడ్డి మాత్రం సజ్జల రామకృష్ణారెడ్డికి అవకాశం ఇస్తూనే ఉన్నారు. ఏకంగా ఆయనకు రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకునే బాధ్యతలు అప్పగించారు. ఇటీవల విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యల నేపథ్యంలో సజ్జలను జగన్మోహన్ రెడ్డి మార్పు చేయడం మాత్రం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు భార్గవరెడ్డిని సోషల్ మీడియా ఇన్చార్జి పదవి నుంచి తొలగించారు. ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డికి సైతం రాష్ట్ర సమన్వయకర్త పదవి నుంచి తొలగించారు. దీంతో జగన్మోహన్ రెడ్డికి తత్వం బోధపడినట్లు అయింది. మరోవైపు సజ్జల రామకృష్ణారెడ్డి ఖాళీ చేసిన రాష్ట్ర సమన్వయకర్త పదవిని తన సొంత నేతకు అప్పగించుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. 2024 ఎన్నికలకు ముందు టిడిపి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సతీష్ రెడ్డికి ఇవ్వాలని ఒక నిర్ణయానికి వచ్చారు. సతీష్ రెడ్డి సుదీర్ఘకాలం వైయస్సార్ కుటుంబం పై పోటీ చేస్తూ వచ్చారు. ముందుగా రాజశేఖరరెడ్డి, తరువాత జగన్మోహన్ రెడ్డి లపై పోటీ చేస్తూ వచ్చిన ఆయనకు 2024 ఎన్నికల్లో టికెట్ నిరాకరించారు చంద్రబాబు. ఆ ఎన్నికల్లో బీటెక్ రవికి అవకాశం కల్పించడంతో బయటకు వచ్చేసారు సతీష్ రెడ్డి. అయితే పార్టీ ఓటమి తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డి పై అభిమానంతో అదే పార్టీలో కొనసాగుతున్నారు. చాలా యాక్టివ్ గా పని చేస్తున్నారు. అందుకే రాష్ట్ర సమన్వయ బాధ్యతలను సతీష్ రెడ్డికి అప్పగించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. అయితే సజ్జల రామకృష్ణారెడ్డికి వేరే బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. కానీ సజ్జలను రాష్ట్ర సమన్వయకర్త బాధ్యతలు నుంచి తొలగిస్తే మాత్రం ఆయన ఇబ్బంది పడక తప్పదు. ఇప్పటికే సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు అజ్ఞాతంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కేసులకు భయపడి దూరంగా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇటువంటి సమయంలో సజ్జల రామకృష్ణారెడ్డికి సైతం ఆ పదవులను దూరం చేస్తుండడం మాత్రం కొత్త ఆలోచనలు తెరపైకి వస్తున్నాయి. సజ్జలకు పొమ్మనలేక పొగ పెడుతున్నారా అన్న అనుమానాలు కూడా తలెత్తుతున్నాయి.

# తీరానికి వాడేసుకుంటున్న కూటమి సర్కార్




**కాకినాడ, ఏప్రిల్ 9, పెన్ పవర్:** ఏపీ సీఎం చంద్రబాబు అంది వచ్చిన ఏ అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు సైతం ఆయన ప్రయత్నిస్తూనే ఉన్నారు. అటు కేంద్రం సైతం ఏపీకి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల విషయంలో ఇప్పటికే దూకుడుగా ఉంది ఏపీ ప్రభుత్వం. కొద్ది నెలల కిందట విశాఖ కేంద్రంగా రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు ప్రధాని మోదీ. ఇప్పుడు ఉత్తరాంధ్రలో నేవీకి సంబంధించి యుద్ధ నౌకల కేంద్రంతో పాటు ఆయుధ డిపో ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చింది. ఈ విషయంలో చంద్రబాబు అత్యంత చొరవ తీసుకుంటున్నారు. ఇండియన్ నేవీ కి భూములను కేటాయించి.. ఇక్కడ ఏర్పాటు అయ్యేలా కేంద్రాన్ని ఒప్పిస్తున్నారు. తూర్పు కోస్తాప్రాంతంగా విశాఖకు గుర్తింపు ఉంది. ఇప్పటికే నేవీ కార్యకలాపాలకు కేంద్రంగా మారింది విశాఖ నగరం. తూర్పు కోస్తా తీర పరిరక్షణకు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది మొదలు.. నావీ సేవలను విస్తృత పరుస్తూ వస్తోంది. అందులో భాగంగా దేశానికి అవసరమైన యుద్ధ నౌకల తయారీ కేంద్రం, ఆయుధ డిపోను ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి స్థలం అవసరం అని కేంద్రం కోరింది. దానికి భూమిని సమకూర్చే పనిలో పడింది చంద్రబాబు సర్కార్. ఈ రెండు ఏర్పాటు అయితే ఏపీకి జాతీయ పరంగా ప్రత్యేక గుర్తింపు దక్కినట్టే. ఉద్యోగ ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడే అవకాశం ఉంది. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా తూర్పు కోస్తా నావికాదళం కొనసాగుతోంది. దేశంలోనే విస్తృత సేవలు అందిస్తోంది ఈ ప్రాంతీయ కార్యాలయం. ఇప్పుడు మరో ముందడుగు వేసింది. విశాఖకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాంబిల్లిలో యుద్ధనౌకల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది నావికాదళం. దీనికి గాను రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. దీనిపై శరవేగంగా స్పందించింది చంద్రబాబు సర్కార్. అక్కడ భూముల ఏర్పాటుకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాంబిల్లిలో 32 యుద్ధ నౌకలు నిలిపేలా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అనుసంధానంగా కేంద్ర ప్రభుత్వమే ఒక పోర్టు ఏర్పాటు చేయనుంది. అదే జరిగితే భారీ ఎత్తున ఉద్యోగాల కల్పన జరుగుతుందని నావికాదళం అధికారులు చెబుతున్నారు. ఇంకోవైపు విజయనగరం జిల్లా బాడంగిలో నావికాదళానికి సంబంధించి ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో అక్కడ ఒక ఎయిర్పోర్ట్ ఉండేది. కాలక్రమంలో అది కనుమరుగయింది. కానీ ఆ ఎయిర్ క్రాఫ్ట్ భూములు మాత్రం రైతుల ఆధీనంలో ఉన్నాయి. ఒకవైపు అదే జిల్లాలోని భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్పోర్ట్ నిర్మాణం.. ఇంకోవైపు రైల్వే మార్గం.. మరోవైపు జాతీయ రహదారులు ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని బాడంగిలో నావికాదళం ఆయుధం డిపో ఏర్పాటుకు దేశస్థాయి అధికారులు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

మొత్తానికి అయితే చంద్రబాబు సర్కార్ తీర ప్రాంతాన్ని రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు వినియోగించుకుంటోంది. ఇప్పటికే విశాఖను పర్యాటకంగా, పారిశ్రామిక హబ్ గా మార్చేందుకు చంద్రబాబు సర్కార్ కృత నిశ్చయంతో ఉంది. ఐటీ పరంగా చాలా సంస్థలను ఇక్కడ నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పలు అంతర్జాతీయ సంస్థలు సైతం తమ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధపడుతున్నాయి. ఒకవైపు పారిశ్రామికం, ఇంకో వైపు ఐటి, మరోవైపు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో విశాఖ దేదీప్యమానంగా వెలగనుంది. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల సరసన చేరనుంది.

## బిగ్ బాస్ లోకి అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్



**రాజమండ్రి ఏప్రిల్ 9, పెన్ పవర్:** ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది ఎవరైనా ఉన్నారంటే వారు 'అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్. గత 4 రోజులుగా నెట్టింట వీరిపై ఒకటే ట్రోల్స్, మీమ్స్, క్లారిఫికేషన్ వీడియోస్, అపాలజీ వీడియోస్. చాలాకాలంగా పచ్చళ్ల వ్యాపారం చేస్తూ కస్టమర్లపై బూతులతో విరుచుకుపడడంతో వీరిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ప్రముఖ రియాల్టీ షో బిగ్ బాస్‌లో అలేఖ్య చిట్టి, రమ్య సిస్టర్స్‌లో ఒకరికి ఛాన్స్ వస్తుందనే వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. బిగ్ బాస్ సీజన్ 9 త్వరలోనే కొన్ని నెలల్లో ప్రారంభం కానుండగా.. ప్రతి ఏడాది ఆగస్ట్ లేదా సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో ప్రోగ్రాం స్టార్ట్ అయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో కంటెస్టెంట్స్ ఎంపిక, బిగ్ బాస్ ప్రోగ్రాం నిర్వహణ పనుల్లో టీం ఉంది. సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయిన వారికి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు బిగ్ బాస్ ఎంట్రీ దక్కుతుంది. 'అలేఖ్య చిట్టి పికిల్స్' సిస్టర్స్‌పై మీమ్స్, ట్రోల్స్, వీడియోలు 100 మిలియన్స్‌కు పైగా వీడియోలతో ట్రెండ్ అవుతున్నాయి. దీంతో వీరిలో ఒకరికి ఛాన్స్ దక్కే అవకాశాలున్నాయని నెట్టింట చర్చ సాగుతోంది. అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్‌లో రీల్స్‌తో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న రమ్యకే ఆ అవకాశం ఉంటుందని నెటిజన్లు అంటున్నారు. మోడ్రన్ డ్రెస్సుల్లో ఆమె చేసిన రీల్స్ ఎక్కువగా ట్రెండ్ అవుతుండడమే దీనికి కారణమని చెబుతున్నారు. తాజాగా, జియో హాట్ స్టార్‌లో పికిల్స్‌కు సంబంధించి ఓ సీన్ సైతం వీడియో షేర్ చేశారు. ప్రభాస్ ఛత్రపతి సినిమాలో ఓ సీన్‌తో వీడియో విడుదల చేశారు. తాజాగా, బిగ్ బాస్ ఆదిరెడ్డి కూడా తన యూట్యూబ్ ఛానల్‌లో ఈ విషయంపై స్పందించారు. వారిలో ఒకరు బిగ్ బాస్‌కు రావొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజమండ్రి వేదికగా 'అలేఖ్య చిట్టి పికిల్స్' పేరుతో ముగ్గురు సిస్టర్స్ సుమ కంచర్ల, అలేఖ్య చిట్టి, రమ్య మోక్ష కంచర్ల (రమ్య గోపాలకృష్ణ) సోషల్ మీడియాలో పచ్చళ్ల వ్యాపారం ప్రారంభించారు. వీరిలో రమ్య తన రీల్స్‌తోనూ పాపులర్ అయ్యారు. తమను విమర్శించిన వారిపై అంతేస్థాయిలో సోషల్ మీడియా వేదికగా విమర్శలు సైతం చేశారు. అయితే పచ్చళ్ల ధరలు ఎక్కువగా ఉన్నాయంటూ ప్రశ్నించిన ఓ నెటిజన్‌కు వీరిలో ఓ అమ్మాయి అలేఖ్య అతనిపై బూతులతో విరుచుకుపడింది. ఈ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇదే సమయంలో తమను కూడా అలానే తిట్టిందంటూ మరిన్ని ఆడియో లీక్స్ బయటకు వచ్చాయి. దీంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లపై ట్రోలింగ్ మొదలైంది. అంత దారుణంగా ఎలా తిడతారంటూ కామెంట్స్ చేశారు. దీంతో అక్క సుమ కంచర్ల తాను తిట్టలేదని.. తనను ట్రోల్ చెయ్యొద్దని వేడుకున్నారు. ఈ అంశంపై వివాదం ముదురుతున్న వేళ అలేఖ్య ఎట్టకేలకు సారీ చెప్పారు. తాను తప్పు చేశానని.. తాను ఎవరినైతే ఇప్పటివరకూ తిట్టానో వాళ్లందర్నీ సారీ అడుగుతున్నట్లు ఓ వీడియో విడుదల చేశారు. దీంతో ఈ వివాదానికి ఎండ్ కార్డ్ పడినట్లే అనిపిస్తున్నప్పటికీ ఇంకా ట్రోలింగ్ మాత్రం కొనసాగుతూనే ఉంది.

## రజనీని అడ్డంగా బుక్ చేస్తున్న ఎంపీ

**గుంటూరు, ఏప్రిల్ 9, పెన్ పవర్:** వైసిపి నేతల విషయంలో టిడిపి నేతలు కొంతమంది కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు కొంతమంది టీడీపీ నేతలు గతంలో తమ ఇబ్బంది పెట్టిన నాయకుల విషయంలో వెనక్కు తగ్గడం లేదు. ఈ విషయంలో పల్నాడు జిల్లా ముందుంటుంది. నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు వర్సెస్ చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి విడుదల రజిని ల మధ్య వాతావరణం చినికి చినికి గాలి వానగా మారింది. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎంపీ కంటే మంత్రిగా ఉన్న రజిని పవర్ ఫుల్ గా ఉండేవారు. ఆమె మాటకు వైసీపీ అధిష్టానం వద్ద కాస్త వెయిట్ ఎక్కువగా ఉండేది. దీనితో రజిని ఆడిందే ఆట పాడిందే పాటగా ఉండేది. దీనికి తోడు అధికారులు కూడా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆమెకు పెద్ద ఎత్తున సహకరించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇలా సహకరించబట్టే ఐపీఎస్ అధికారులను అడ్డం పెట్టుకుని.. ఒక స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి ఏకంగా రెండు కోట్ల రూపాయలు రజనీ తీసుకున్నారు అనేది టీడీపీ ప్రధాన ఆరోపణ. ఇక రజనీ విషయంలో లావు కృష్ణదేవరాయలు ఇప్పుడు దూకుడుగా ఉన్నారు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన తర్వాత మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. లావు కృష్ణదేవరాయలపై ఆరోపణలు చేసిన రజిని ఆ తర్వాత ఎంపీ ఇచ్చిన స్ట్రోక్ కి కంగుతిన్నారు. ఆమె మొదలు పెట్టారని తాను ఆపే ప్రసక్తే లేదని.. ఇది ఎక్కడ వరకు వెళుతుందో చూడాలంటూ లావు కృష్ణదేవరాయలు ఘాటుగా మాట్లాడారు. చాలెంజ్ కు తగ్గట్టు ఇప్పుడు రజిని వ్యవహారాలపై ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆమె చేసిన అక్రమాలకు.. సంబంధించి నివేదికలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో పాటుగా కేంద్ర ప్రభుత్వం పెద్దలకు కూడా ఇస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రైతుల భూముల విషయంలో ఆమె అనుసరించిన వైఖరి, పాల్పడిన అక్రమాలపై సాక్షా లతో సహా ఆయన ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఆమె మరిది గోపిని అడ్డం పెట్టుకొని ఆమె పెద్ద ఎత్తున చిలకలూరిపేట నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడ్డారు అనేది ఎంపీ ఆరోపణ. ఇప్పుడు వాటిని రుజువు చేసేందుకు పక్కా.. ఆధారాలతో ఆయన రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. తాజాగా చిలకలూరిపేటలో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ లో కొంతమంది రైతులు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు కూడా చేసారు. రజినీ పై చర్యలు తీసుకోవాలని ఆమె మరిది గోపి పై కేసు నమోదు చేయాలని కోరారు. ఇలాగే మరికొన్ని కేసులు బయటకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించిన వ్యవహారంలో ఏసీబీ అధికారులు గవర్నర్ అనుమతి తీసుకునే కేసు నమోదు చేశారు. దీనితో భవిష్యత్తులో రజనీకి ఇబ్బందులు తప్పవని.. ముఖ్యంగా లావు కృష్ణదేవరాయల నుంచి ఆమె మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొక తప్పదని, ఇదే ఆమె రాజకీయ జీవితాన్ని నాశనం చేసినా ఆశ్చర్యం లేదంటూ కొంతమంది కామెంట్ చేస్తున్నారు.

## టీడీపీ నేతలదే హవా...

**విజయనగరం, ఏప్రిల్ 9, పెన్ పవర్:** ఏపీలో కూటమి ఏకపక్ష విజయం దక్కించుకున్న జిల్లాల్లో విజయనగరం ఒకటి. దాదాపు అన్ని నియోజకవర్గాలను కైవసం చేసుకుంది కూటమి. బలమైన బొత్స సామ్రాజ్యం కూలిపోయింది. ఆ కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఓటమి చవిచూశారు. అయితే ఇంతటి విజయాన్ని నిలుపుకోలేని స్థితిలో ఉంది కూటమి. అధికారంలోకి వచ్చిన పది నెలలకే విభేదాల పర్వం మొదలైంది. పతాక స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లిమర్లలో పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే వర్సెస్ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి అన్నట్టు పరిస్థితి మారింది. రెండు పార్టీల అధినాయకత్వాలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా ఈ ఇద్దరు నేతలు పట్టించుకోవడం లేదు. దీంతో ఇక్కడ కూటమిలో అడ్డగోలు చీలిక కనిపిస్తోంది.

2024 ఎన్నికల్లో పొత్తులో భాగంగా నెల్లిమర్ల నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ తరపున లోకం మాధవి పోటీ చేశారు. టిడిపి శ్రేణులు సహకరించడంతో భారీ మెజారిటీతో గెలిచారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మాధవి టిడిపి శ్రేణులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శ ఉంది. టిడిపిని కాదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన వారికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. తనకంటూ నియోజకవర్గంలో ఒక సొంత క్యాడర్ను తయారు చేసుకునే పనిలో పడ్డట్టు తెలుస్తోంది. 2019లో కేవలం 5000 ఓట్ల వరకు మాత్రమే తెచ్చుకున్నారు మాధవి. అందుకే ముందు జాగ్రత్త చర్యగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను తన వైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. గత ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తూ వచ్చారు నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు. తనకే టికెట్ వస్తుందని ఆయన ఆశలు పెట్టుకున్నారు. పార్టీ కోసం బాగానే ఖర్చు పెట్టారు. లోకేష్ పాదయాత్ర ముగింపును తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయించారు. అయితే ఇక్కడ టిడిపికి మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు ఉండేవారు. ఆయన వయోభారంతో పక్కకు తప్పుకోవడంతో బంగార్రాజుకు నియోజకవర్గ టిడిపి బాధ్యతలు అప్పగించారు. దీంతో తనకు టికెట్ ఖాయమని భావించిన కర్రోతు బాగానే కష్టపడ్డారు. పొత్తులో భాగంగా ఈ సీటును జనసేనకు కేటాయించడంతో బాధపడ్డారు. కానీ చంద్రబాబు సముదాయించడంతో జనసేన అభ్యర్థి లోకం మాధవి గెలుపు కోసం కృషి చేశారు. అయితే ఇప్పుడు అదే కర్రోతును నిర్లక్ష్యం చేస్తున్నారు ఎమ్మెల్యే మాధవి. టిడిపి క్యాడర్ తో పాటు నాయకత్వాన్ని నిర్వీర్యం చేసే పనిలో పడ్డారు. అందుకే ఇక్కడ విభేదాలు రోజు రోజుకు ముదురుతున్నాయి. పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. ఎత్తుకు పైఎత్తులు అన్నట్టు సాగుతున్నాయి.

## జట్టుకు భారంగా మారాడంటూ విమర్శలు... ధోనీపై రాబిన్ ఉతప్ప ఆసక్తికర వ్యాఖ్యలు

- ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో ఆడలేకపోతున్న సీఎస్‌కే
- ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగింట ఓటమి
- ధోనీ జట్టుకు భారంగా మారాడనే వ్యాఖ్యలు
- చెన్నై టీమ్‌కు ధోనీ ఎప్పటికీ సమస్య కాదన్న రాబిన్ ఉతప్ప
- ప్రస్తుతం జట్టు మార్పు దశలో ఉందన్న మాజీ ప్లేయర్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో ఆడలేక చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) అభిమానులను తీవ్రంగా నిరాశపరుస్తున్న విషయం తెలిసిందే. వరుసగా నాలుగు ఓటములతో ఆ జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. ఆడిన ఐదు మ్యాచ్ లలో ఒక్క విజయం మాత్రమే నమోదు చేసింది. నిన్నటి మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్)పై చివరి వరకు పోరాడినా విజయాన్ని మాత్రం అందుకోలేక పోయింది. 18 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఇక మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గత నాలుగు మ్యాచుల్లో లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌కు రాగా... నిన్న మాత్రం ప్రమోషన్ పొంది ఐదో స్థానంలో క్రీజులోకి వచ్చాడు. 12 బంతుల్లోనే 27 రన్స్ బాదాడు. కాగా, ఈ మ్యాచ్ ముందు వరకు ధోనీ జట్టుకు భారంగా మారాడనే వ్యాఖ్యలు వినిపించాయి. ఈ నేపథ్యంలో సీఎస్‌కే మాజీ ప్లేయర్ రాబిన్ ఉతప్ప... ఎంఎస్‌డీ విషయమై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. చెన్నై టీమ్‌కు ధోనీ విషయం ఎప్పటికీ సమస్య కాదని, ప్రస్తుతం జట్టు మార్పు దశలో ఉందని పేర్కొన్నాడు.

రాబిన్ ఉతప్ప మాట్లాడుతూ... "ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌పై ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు. చెన్నై జట్టుకు ఒక భారంగా ధోనీ ఎప్పటికీ మారడు. అతని ఆటతీరులో దూకుడు లేదనే వ్యాఖ్యలు సరికాదు. రాబోయే కాలంలో సీఎస్‌కే నుంచి ఏం ఆశిస్తున్నారనేది ఎంఎస్‌డీకి బాగా తెలుసు. ఇప్పుడు చెన్నై సూపర్ కింగ్స్ జట్టు మార్పుల దశలో ఉంది. తప్పకుండా అన్ని సమస్యలకు ముగింపు దక్కుతుందని ఆశిస్తున్నా" అని మాజీ ఆటగాడు అన్నాడు.

## మా లీగ్ మొదలవుతుంది.. IPL వదిలేసి PSL చూస్తారు: పాకిస్థాన్ స్టార్ పేసర్




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులని అలరించడానికి మరో ధనాధన్ టీ20 లీగ్ సిద్ధంగా ఉంది. మరో రెండు రోజుల్లో పాకిస్థాన్ సూపర్ లీగ్ 2025 పదో ఎడిషన్ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 11న ప్రారంభం కానున్న ఈ టోర్నీ మే 18న ఫైనల్ తో ముగుస్తుంది. ఈ టోర్నీ ప్రారంభానికి ముందు పాకిస్థాన్ లో పండగ వాతావరణం నెలకొంది. తొలిసారి పాకిస్థాన్ సూపర్ లీగ్ ఐపీఎల్ తో పోటీ పడనుండడం ఆసక్తికరంగా మారింది. ఐపీఎల్ తర్వాత పాకిస్థాన్ సూపర్ లీగ్ ను ఎక్కువగా చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపిస్తారు. ఈ సారి రెండు లీగ్స్ క్లాష్ అవ్వడంతో క్రికెట్ ఫ్యాన్స్ కు డబుల్ కిక్ లభించనుంది.

ఈ టోర్నీకి ముందు పాకిస్థాన్ స్టార్ ఫాస్ట్ బౌలర్ హసన్ అలీ సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన బోల్డ్ స్టేట్ మెంట్ తో ఆశ్చర్యానికి గురి చేశాడు. హసన్ మాట్లాడుతూ.. "అభిమానులు మా టోర్నమెంట్‌ను చూస్తారు. మా టోర్నమెంట్ లో ఫ్యాన్స్ కు మంచి వినోదం దొరుకుతుంది. మేము పాకిస్థాన్ సూపర్ లీగ్ లో బాగా ఆడితే ప్రేక్షకులు ఐపీఎల్ వదిలేసి మా లీగ్ చూస్తారు". అని చెప్పాడు. హసన్ పాకిస్థాన్ సూపర్ లీగ్ లో కరాచీ సూపర్ కింగ్స్ తరపున వార్నర్ కెప్టెన్సీలో ఆడనున్నాడు.ఇప్పటివరకు ఈ టోర్నీలో 82 మ్యాచ్ ల్లో 108 వికెట్లు పడగొట్టాడు. మరో 6 వికెట్లు తీస్తే ఈ లీగ్ లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా చరిత్ర సృష్టిస్తాడు. డిఫెండింగ్ ఛాంపియన్స్ గా ఇస్లామాబాద్ యునైటెడ్ బరిలోకి దిగుతుంది. టోర్నీ తొలి మ్యాచ్ లో లాహోర్ ఖలందర్స్ తో ఇస్లామాబాద్ యునైటెడ్ తలపడనుంది. రావల్పిండి వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. రావల్పిండి క్వాలిఫైయర్ 1తో సహా టోర్నమెంట్‌లోని 11 మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనుంది. లాహోర్‌లోని ఐకానిక్ గడాఫీ స్టేడియంలో ఫైనల్, ఎలిమినేటర్స్ తో సహా మొత్తం 13 మ్యాచ్ లు జరుగుతాయి. కరాచీలోని నేషనల్ స్టేడియం, ముల్తాన్ చెరో ఐదు మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. మొత్తం 6 జట్లు (ఇస్లామాబాద్ యునైటెడ్, లాహోర్ ఖలందర్స్,పెషావర్ జల్మీ, క్వెట్టా గ్లాడియేటర్స్,కరాచీ కింగ్స్, ముల్తాన్ సుల్తాన్స్) టైటిల్ కోసం తలపడనున్నాయి.

## అప్పుడు వరల్డ్ కప్ ఫైనల్.. ఇప్పుడు ఐపీఎల్: యాక్టింగ్‌తో మ్యాచ్ ఫలితాన్ని మార్చేసిన పంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో మంగళవారం (ఏప్రిల్ 8) మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ పై లక్నో సూపర్ జయింట్స్ థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన హై స్కోరింగ్ మ్యాచ్ లో 4 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది.మొదట బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో కోల్‌కతా నైట్ రైడర్స్ 7 వికెట్లను 234 పరుగులు చేసి ఓడిపోయింది. భారీ స్కోర్ కళ్ళ ముందు కనబడుతున్నా కోల్‌కతా పోరాడిన తీరు అద్భుతం. టాపార్డర్ లో సునీల్ నరైన్ (13 బంతుల్లో 30) తో పాటు కెప్టెన్ రహానే (35 బంతుల్లో 61:8 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడారు. నరైన్ ఔటైనప్పటికీ వెంకటేష్ అయ్యర్ తో రహానే ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లాడు. ఇద్దరూ జాగ్రత్తగా ఆడడంతో కేకేఆర్ విజయం దిశగా పయనించింది. 12 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసిన కేకేఆర్ మరో 8 ఓవర్లలో 90 పరుగులు చేస్తే గెలుస్తుంది. చేతిలో 8 వికెట్లు ఉండడంతో కేకేఆర్ విజయం ఖాయమనిపించింది.

ఈ దశలో లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ తన తెలివిని ప్రదర్శించాడు. తనకు తిమ్మిర్లు వచ్చాయని ఫిజియోనీ పిలిపించాడు. దీంతో గ్రౌండ్ లో కాసేపు ఆటకు అంతరాయం కలిగింది. మధ్యలో బ్రేక్ రావడం లక్నోకి బాగా కలిసి వచ్చింది. 13 ఓవర్ నుంచి కోల్ కతా వరుసగా వికెట్లను కోల్పోతూ వస్తుంది. 7 ఓవర్లలో 77 పరుగులు చేయాల్సిన దశలో రహానే ఔట్ కావడంతో కోల్‌కతా ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ తర్వాత వెంటనే రఘువంశీ, రమణ్ దీప్ సింగ్ పెవిలియన్ కు చేరారు. ఆండ్రీ రస్సెల్, వెంకటేష్ అయ్యర్ పెవిలియన్ బాట పట్టడంతో కేకేఆర్ ఓటమి దిశగా పయనించింది. చివర్లో రింకూ సింగ్ పోరాడినప్పటికీ విజయానికి 4 పరుగుల దూరంలో నిలిచిపోయింది. టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తెలివితేటలు భారత్ కు కప్ అందించడంలో సహాయం చేశాయి. క్లాసెన్, మిల్లర్ మ్యాచ్ ముగించేలా ఉన్న సమయంలో గాయం సాకుతో పంత్ సమయాన్ని వృథా చేశాడు. ఇలా చేయడం టీమిండియాకు అనుకూలంగా మారింది. ఆ నాలుగైదు నిమిషాలలో క్లాసెన్ ఏకాగ్రత కోల్పోయాడు తెలిపాడు. ఫైనల్ తర్వాత తాను కావాలనే యాక్టింగ్ చేశానని పంత్ చెప్పడం విశేషం. మరోసారి ఐపీఎల్ లో పంత్ అదే సీన్ రిపీట్ చేయడం లక్నో విజయానికి కారణమైంది.

# కీర్తి లీగ్ లోనే ఉంది.. రుక్మిణి ఛాన్స్ కొట్టేసింది..!



ట్రెండీ అవుట్‌ఫిట్‌లో తమన్నా సాసీ లుక్



మహానటిగా సినీ ప్రియుల మన్ననలను పొందిన కీర్తి సురేష్ నటిగా తనని తాను ప్రూవ్ చేసుకుంటూ వచ్చింది. ఎలాంటి ఛాలెంజింగ్ రోల్ అయినా కూడా తన దాకా వస్తే పాత్రలో పరకాయ ప్రవేశం చేసి అదరగొట్టేస్తుంది అమ్మడు. ఐతే పెళ్లి తర్వాత ఎవరికైనా అవకాశాలు కాస్త సన్నగిల్లుతాయన్న పరిస్థితి ఉంటుంది. ఐతే కీర్తి సురేష్ విషయంలో కూడా అలాంటిది ఉంటుందని అనుకున్నారు. కానీ ఆమెకు వస్తున్న ఆఫర్లు చూస్తే అది నిజం కాదన్నదని అర్థమవుతుంది.

ముఖ్యంగా పెళ్లైన కీర్తి సురేష్ ఒక ఆరు నెలలుగా ఎలాంటి కొత్త సినిమాకు సైన్ చేయలేదు. ఐతే ఆ టైం లో కీర్తి పని అయిపోయిందని అనుకున్నారు అందరు. కానీ వరుసగా ఆమె సైన్ చేసిన సినిమాల గురించి బయటకు వస్తున్న న్యూస్ లు చూసి అందరు షాక్ అవుతున్నారు. కీర్తి సురేష్ తెలుగులో రెండు భారీ సినిమాలకు సైన్ చేసిందని తెలుస్తుంది. కీర్తి ఇప్పటికే విజయ్ దేవరకొండతో కలిసి జత కడుతున్నట్టు టాక్. విజయ్ దేవరకొండతో రవికిరణ్ కోలా డైరెక్షన్ లో వస్తున్న సినిమాలో కీర్తి లక్కీ ఆఫర్ అందుకుంది. ఈ సినిమాలో ముందు సప్త సాగరాలు దాటి హీరోయిన్ రుక్మిణి వసంత్ ని తీసుకోవాలని అనుకున్నారట. ఆ సినిమా కన్నడలో హిట్టైనా తెలుగులో ఆమెకు సూపర్ ఫ్యాన్స్ ఏర్పడ్డారు. ఈ క్రమంలో రుక్మిణికి రౌడీ హీరో సినిమా ఛాన్స్ వస్తుందని అనుకున్నారు. కానీ ఇప్పుడు రుక్మిణి కాదు ఆ అవకాశం కీర్తి సురేష్ కే ఇచ్చారని తెలుస్తుంది. ఇదే కాదు కీర్తి సురేష్ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ వచ్చింది. బలగం సినిమా చేసిన వేణు యెల్దండి నెక్స్ట్ చేయబోతున్న ఎల్లమ్మ సినిమాలో కీర్తి సురేష్ ఆఫర్ పట్టేసిందట. ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు చాలా వెయిట్ ఉంటుందని తెలుస్తుంది. తప్పకుండా ఈ సినిమాలతో అమ్మడు అదరగొట్టబోతుందని టాక్. ఇవే కాదు స్టార్ లీగ్ లో తాను ఉన్నానని అనేలా అమ్మడు ప్రూవ్ చేసుకుంటుంది. తమిళ్ లో మొన్నటిదాకా సినిమాలు చేసిన కీర్తి సురేష్ తెలుగులో చివరగా భోళా శంకర్ సినిమా చేసింది. దసరాలో వెన్నెల పాత్రలో ఇంప్రెస్ చేసిన కీర్తి భోళా శంకర్ తో నిరాశపరచింది. ఇక ఆ తర్వాత నెక్స్ట్ సినిమాలతో మరోసారి ఆకట్టుకోబోతుంది.



ఖుషీ కపూర్ యొక్క రవిషింగ్ పోజులు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com